మహిళ మోములో వెలుగులు

- ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం
- పండుగ వాతావరణంలో నిర్వహణ
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు
- లబ్ధిదారు ఇంట్లో టీ కాచిన మంత్రి సవిత
- జిల్లాలో 5,36,289 మందికి లబ్ధి

పుట్టపర్తి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం దీపావళి ధమాకా ఇచ్చి మహిళ మోములో వెలుగులు నింపింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా దీపం-2 పథకానికి శ్రీకారం చుట్టింది. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభోత్సవం శుక్రవారం జిల్లావ్యాప్తంగా వేడుకలా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని, లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లను పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారుల మోములో వెలుగులు నిండాయి. జిల్లాలో 5,36,289 మంది లబ్ధిదారులకు దీపం-2 పథకం కింద ప్రయోజనం చేకూరింది. తెల్లరేషన్ కార్డుదారు లందరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నారు.


ఉచిత సిలిండర్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత


ప్రజలను మభ్యపెట్టే పార్టీలకు సూపర్‌సిక్స్‌తో గుణపాఠం
మంత్రి సవిత
గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

గ్యాస్ సిలిండర్‌ను తెచ్చింది చంద్రబాబే
మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం(ఆంధ్రజ్యోతి): కట్టెలపొయ్యితో మహిళలు పడుతున్న ఇబ్బందులను గమనించి, పేదల ఇంటికి గ్యాస్ సిలిండర్ తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ధర్మవరంలోని లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీలో మంత్రి సత్యకుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఉచిత సిలిండర్ల పంపిణీని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ఉచిత గ్యాస్ సిలిండర్ల ద్వారా పేదలపై ఆర్థిక భారం తగ్గుతోందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రేషన్‌కార్డులు తొలగించడం మూలంగా ఎంతోమంది కూటమి సానుభూతిపరులకు పథకాలు దక్కకుండా పోయాయన్నారు. రేషన్‌కార్డులను పునరుద్ధరించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ చేతన్ పాల్గొన్నారు.


గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పెనుకొండ టౌన్, (ఆంధ్రజ్యోతి): పథకాల అమలు చేతగాని వైసీపీకి సూపర్‌సిక్స్ పథకాలతో గుణపాఠం చెబుతామని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ తహసీల్దార్ కార్యాలయంలో ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీని మంత్రి ప్రారంభించారు. హామీల అమలు చేతగాక వైసీపీ.. ప్రజలను మభ్యపెట్టి, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. సూపర్-6 అమలులో భాగంగా ఏటా మూడు సిలెండర్లు ఉచితంగా ఇస్తామని అన్నారు.

ఉచిత గ్యాస్‌తో టీ చేసిన మంత్రి

పెనుకొండ నారాయణమ్మ కాలనీలో కూటమి ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత గ్యాస్‌తో మంత్రి సవిత టీ చేశారు. లబ్ధిదారు అనంతమ్మ ఇంట్లో టీ చేసిన మంత్రి.. ఆ కుటుంబ సభ్యులు, అక్కడికి వచ్చిన అధికారులు, పార్టీ నాయకులకు అందించి.. తానూ రుచి చూశారు. తాను మంత్రిని అయినా..



ఓ గృహిణిని అని, కుటుంబాల్లో మహిళల ఇబ్బందులు తనకు తెలుసునని అన్నారు. వారి కష్టాలను తీర్చే క్రమంలో ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


ఉచిత సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

టీడీపీతోనే మహిళా సాధికారత: పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సాయిఆరామంలో ఉచితగ్యాస్ సిలిండర్ల పంపిణీని ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దీపం పథకం అమలు ద్వారా మహిళలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

కడుపునింపే దీపం : ఎంపీ బీకే

హిందూపురం అర్బన్(ఆంధ్రజ్యోతి): దీపం-2 కడుపునింపే దీపమని ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. హిందూపురంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని బీకే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇంటికి దీపంతో వెలుగు వస్తే.. రాష్ట్రానికి చంద్రబాబుతోనే వెలుగు అన్నారు. పథకం 2వ విడుత పంపిణీ కార్యక్రమంకు వైసీపీ ఐదేళ్ల నరకాసుర పాలనలో రాష్ట్రం మొత్తం చీకటిలో ఉండిపోయిందన్నారు. ఈ దీపావళితో ఆ చీకటి నుంచి రాష్ట్ర ప్రజలను బయట పడేసి చంద్రబాబు కొత్త వెలుగులు నింపారనానరు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: కందికుంట

కదిరి(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని సిరికల్చర్ మార్కెట్ యార్డులో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పేదలపై ఆర్థిక భారం తగ్గించడానికి ప్రభుత్వం ఏటా ఉచితంగా మూడు సిలిండర్లు అందజేస్తుందన్నారు.


ఉచిత సిలిండర్ అందిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎంఎస్ రాజు

మడకశిరటౌన్(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తామని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు అన్నారు. పట్టణంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో సంక్షేమ పథకాల ముసుగులో ఆర్థిక దోపిడీ చేశారన్నారు. కొందరు దళారులు, అధికారులతో కుమ్మక్కై లబ్ధి పొంది, అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేశారన్నారు. చంద్రన్న పాలనలో అలాంటి వాటికి తావులేదన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఊరూరా దీపావళి


గోరంట్లలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో బాణసంచా కాల్చుతూ సంబరాలు




ప్రశాంతి నిలయంలో నృత్యం చేస్తున్న భక్తులు, టపాసులు కాల్చుతున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని ఊరూరా గురు, శుక్రవారాల్లో ఘనంగా చేసుకున్నారు. ఇళ్లలో ఉదయాన్నే పూజలు చేసుకున్నారు. సాయంత్రం ఇంటి పరిసరాలు, ముంగిట్లో దీపాలు వెలిగించారు. రాత్రికి పెద్దఎత్తున బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు.

ప్రశాంతి నిలయంలో..

పుట్టపర్తిలోని ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో దీపావళి వేడుకలు ఘనంగా చేసుకున్నారు. ప్రశాంతి నిలయాన్ని ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలు ఆలపించారు. గుజరాత్ నూతన సంవత్సర వేడుకలను ఆ రాష్ట్ర భక్తులు ఘనంగా చేసుకున్నారు. బాలవికాస్ విద్యార్థులు నృత్య ప్రదర్శనతో అలరించారు. సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ బాణసంచా కాల్చి దీపావళి పండుగ చేసుకున్నారు. ప్రశాంతి నిలయంలో భారీస్థాయిలో కాల్చారు. వేలాదిమంది భక్తులు.. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. శుక్రవారం సాయంత్రం గుజరాత్ భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మహోన్నతుడు పటేల్

కలెక్టర్ చేతన్
ఘనంగా ఉక్కుమనిషి జయంతి
పుట్టపర్తిలో యూనిటీ రన్

పుట్టపర్తిరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భారతదేశ సమగ్రతను చాటిన మహోన్నతుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. గురువారం పటేల్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఐక్యతా పరుగు చేపట్టారు. కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న జెండాఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆస్పత్రి వద్ద ప్రారంభమైన ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణం వరకు కొనసాగింది. అక్కడ పటేల్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి, పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పటేల్ అడుగుజాడల్లో నడవాలన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ.. భారతదేశంలోని సంస్థానాలన్నింటినీ విలీనం చేసి, భిన్నత్వంలో ఏకత్వం చాటిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. దేశ సమగ్రత, ఐక్యతను పరిరక్షించుకుంటామని ప్రతిజ్ఞ సందేశాన్ని చదివి వినించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జాతీయ ఐక్యతా దివస్‌తోపాటు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, మంగళకర ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరచిన విద్యార్థినీవిద్యార్థులు, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను విజయవంతం చేసిన పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు, మొమెంటోలు అందజేశారు.


ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

పోలీసుల అదుపులో వైసీపీ నాయకుడు?

వందలకొద్దీ పట్టాలు, పాసుపుస్తకాల స్వాధీనం

కదిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అనుచరుడు పట్టణానికి చెందిన నిజాంవలీ కాలనీ వాసి షామీర్‌బాషా పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అతడి ఇంటి నుంచి వందలకొద్దీ ఇంటి పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి షామీర్ బాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతడి ఇంట్లో పోలీసులు సోదాలు చేయగా.. వందలకొద్దీ ఒరిజినల్, నకిలీ పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు దొరికినట్లు తెలుస్తోంది. ఇతడి వెనుక మాజీ ఎమ్మెల్యేతోపాటు కొంతమంది వైసీపీ నాయకులున్నట్లు సమాచారం. కొంతమంది ప్రభుత్వోద్యోగుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ, పోలీసు అధికారులు శుక్రవారం ఉదయం నుంచి రికార్డులను తనిఖీ చేస్తున్నట్లు సమాచారం. విచారణ పూర్తయితేగానీ వివరాలు వెల్లడికావు.

అందరికీ కందిపప్పు..!



- పూర్తిస్థాయిలో కేటాయింపు
- కిలో రూ.67తో పంపిణీ
- కార్డుదారుల్లో ఆనందం

ధర్మవరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో పౌరసరఫరాల వ్యవస్థను నిర్వీర్యం చేశారు. బియ్యం మాత్రం ఇచ్చి.. మమ అనిపించారు. కందిపప్పు ఇస్తామని పాలకులు చెబుతారు కానీ, క్షేత్రస్థాయిలో కార్డుదారులకు మాత్రం అందదు. కందిపప్పు ధర భారీగా ఉన్నపుడు రేషన్ షాపులో తీసుకుందామని వెళ్లే కార్డుదారులకే నిరాశే ఎదురయ్యేది. అరకొరగా వచ్చిందనీ, అస్సలు సరఫరానే కాలేదని షాపు నిర్వాహకులు చెబుతుండేవారు. దీంతో ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేసిందా, ఎంత మేర కేటాయించిందన్న విషయాలు పెరుమాళ్లకెరుక. కందిపప్పు కోసం షాపు వద్ద కెళ్లి సరఫరా లేదనీ, అరకొరగానే వచ్చిందనీ, అదికూడా అయిపోయిందని షాపు నిర్వాహకులు చెప్పడంతో కార్డుదారులు నిరాశగా వెనుదిరిగేవారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పౌరసరఫరాల వ్యవస్థను గాడిన పెడుతోంది. కందిపప్పు సరఫరాను పునరుద్ధరిస్తూ వస్తోంది. ప్రస్తుతం పూర్తిస్థాయిలో అందించాలని నిర్ణయించింది. ఆ మేరకు అన్ని రేషన్ షాపులకు చాలినంత కందిపప్పు కేటాయించింది. ఆ మేరకు సరఫరా చేసింది కూడా. దీంతో కార్డుదారులందరికీ కందిపప్పు పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. షాపు నిర్వాహకులు స్టాకు లేదని చెప్పే అవకాశమే లేదు. ప్రస్తుతం కందిపప్పు ధరలు మండిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం పట్ల కార్డుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లూ అరకొరే..

కార్డుదారులందరికీ రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు అందజేస్తున్నారు. కిలో రూ.67 వంతున ప్రతికార్డుకు కిలో కందిపప్పు పంపిణీ చేస్తున్నారు. ఇలా కార్డుదారులందరికీ నెలనెలా కందిపప్పు పంపిణీ చేసిన దాఖలాలు గత ఐదేళ్లుగా లేవు. ప్రతినెలా 25 శాతం మాత్రమే పంపిణీ జరిగేది. ఇలా అరకొరగా పంపిణీ చేయడంతో ప్రభుత్వం నుంచి అసలు కందిపప్పు సరఫరా లేదని రేషన్ దుకాణదారులు బుకాయించడం పరిపాటిగా మారింది. ప్రతినెలా కొంతమందికి మాత్రమే పంపిణీ చేస్తుండటంతో ప్రభుత్వం నుంచి సక్రమంగా సరఫరా కావడంలేదని కార్డుదారులు కూడా మిన్నకుండిపోయేవారు. ఈ గందరగోళానికి ప్రస్తుతం తెరపడింది. కార్డుదారులందరికీ ఒకేసారి కందిపప్పు పంపిణీ చేయడానికి పౌరసరఫరాల శాఖ అన్ని చ్యలు చేపట్టింది. జిల్లాలో 1367 రేషన్ షాపులున్నాయి. వాటి పరిధిలో 5,72,517 కార్డులున్నాయి. ఆయా కార్డుదారులందరికీ సరిపడా 556 టన్నుల కందిపప్పును సరఫరా చేశారు. ఇక నుంచి రేషన్ దుకాణదారులుగానీ, ఎండీయూ వాహన ఆపరేటర్లుగానీ కందిపప్పు సరఫరా కాలేదని సాకులు చెప్పే అవకాశం లేదు. ప్రతికార్డుకు కిలో వంతున రూ.67 ధరతో కందిపప్పు పంపిణీ చేయకతప్పదు. ఇప్పటికే డీడీలు చెల్లించిన రేషన్ దుకాణాలకు ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి అవసరమైన మేరకు కందిపప్పు స్టాకును తరలించారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.170 వరకూ పలుకుతోంది. దీంతో రేషన్‌కార్డుదారులంతా కందిపప్పు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. కందిపప్పు సరిపడా స్టాక్ రాలేదని షాపు నిర్వాహకులుగానీ, ఎండీయూ వాహనదారులుగానీ చెబితే చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. అంత్యోదయకార్డుకు కిలో రూ.13.50 ధరతో చక్కెర కూడా పంపిణీ చేయనున్నారు. మిగిలిన కార్డులకు అరకిలో రూ.17తో ఇవ్వనున్నారు.

అధిక ధర నుంచి ఉపశమనం



బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.170 పెట్టి కొనుగోలు చేస్తున్నాం. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా రూ.67కే ఇస్తుండడం సంతోషంగా ఉంది. ఇది ఉపశమనం కలిగిస్తుంది. - లక్ష్మి, గృహిణి, కొత్తచెరువు

ప్రతి కార్డుదారుడికీ కందిపప్పు అందిస్తాం

జిల్లాలోని 1367 రేషన్ దుకాణాలకు కందిపప్పు సరఫరా అయింది. కార్డుదారులకు కిలో రూ.67 ధరతో పంపిణీ చేస్తాం.

- వంశీ క్రిష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి

ఎప్పుడూ ఆ తుపాకీలే మిస్‌ఫైర్

- వేధింపులు.. ఒత్తిళ్లే కారణమా..?
- గతంలోనూ ఘటనలు..

ఏఆర్ సిబ్బంది బలవన్మరణాలు

అనంతపురం క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్ట రేట్‌లో మిస్‌ఫైర్ కలకలం రేపింది. ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాజు శుక్రవారం తెల్లవారుజామున విధుల్లోకి వెళ్లారు. ఈ క్రమంలోనే తన వద్దనున్న 303 రైఫిల్‌ను క్లీన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలడంతో ఛాతి పక్క నుంచి బుల్లెట్ అవతలి వైపునకు దూసుకెళ్లింది. విషయం తెలియగానే జిల్లా ఎస్పీ జగదీష్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బ రాజును పరామర్శించారు. మెగ్జిన్ ఎందుకు తీయలేదని ప్రశ్నించగా...పొరపాటున జరిగిపోయిందని చెప్పినట్లు తెలిసింది. సుబ్బరాజు గత కొంతకాలంగా ట్రెజరీలో గార్డుగా పని చేస్తున్నారు. గతంలో విధుల్లో నిర్లక్ష్యం కారణంగా రెండుసార్లు సస్పెండ్ అయ్యారు. కొంత వరకు అప్పులున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు ప్రయత్నించే క్రమంలో అలా జరిగిందా...?లేక పొరపాటుగా క్లీన్ చేసే సమయంలో మిస్‌ఫైర్ అయిందా..?అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. బుల్లెట్ రౌండ్స్‌లోడ్ ఉన్న మెగ్జిన్ తీశాకే అందరూ గన్ క్లీన్ చేసుకుంటారు. మరి సుబ్బరాజు ఆ సమయంలో మెగ్జిన్ తీయకుండానే ఎందుకు క్లీన్ చేశాడనేది అంతుబట్టడం లేదు. మిస్‌ఫైర్ల వెనుక అసలు నిజాలు వేరే ఉన్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

మితిమీరిన ఒత్తిళ్లు

ఏఆర్ సిబ్బందిపై ఒత్తిళ్ల కారణంగానే ఆత్మహత్యలు, మిస్‌ఫైర్‌లు జరుగుతున్నాయని తెలుస్తోంది. కొందరు అధికారులు డబ్బు కోసం డిమాండ్ చేయడం కూడా వారిపై ఒత్తిడి పనిచేసినట్లు సమాచారం. వారు అడిగిన చోట డ్యూటీలు వేయకపోవడం కూడా ఇందుకు కారణమవుతున్నట్లు తెలుస్తోంది. నెలల తరబడి ఒకే చోట ఉంచటం కూడా ఒత్తిళ్లకు కారణమవుతున్నట్లు ఏఆర్ విభాగం పోలీసులు వాపోతున్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బరాజు, తుపాకీ పేలినచోట ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

గతంలోనూ మిస్ ఫైర్లు...

గతంలోనూ మిస్‌ఫైర్లు అనేకసార్లు జరిగాయి. అత్యధిక శాతం ఏఆర్ విభాగంలోనే జరగడం గమనార్హం. వాటిలో కొన్ని..

- 2008లో డీఐజీ బంగ్లాలో డీఐజీ గన్‌మ్యాన్ గోపాల్ పిస్టల్ పేలడంతో మృతి చెందారు. మిస్ ఫైరా ...లేక ఆత్మహత్య అనే విషయంలో పోలీసులు స్పష్టత ఇవ్వలేకపోయారు.
- 2009లో మన్నీల సమీపంలోని ఫైరింగ్ రేంజ్‌లో అప్పటి అడ్మిన్ ఆర్ఐ శేఖర్ సిబ్బందికి ఫైరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఆ సందర్భంలో ఆ ఆర్ఐ ఇంటర్ చదువుతున్న తన కొడుకును తీసుకెళ్లాడు. ఆ అబ్బాయి ఓ రైఫిల్‌ను ట్రై చేశాడు. దీంతో సమీపంలో ఉన్న సుంకన్న ఛాతిలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. దీంతో అతను 8 ఏళ్లు ఆసుపత్రిలో, ఏడాది కోమాలో ఉండి బయటపడ్డాడు. ఆ ఘటనపై అప్పటి ఇటుకలపల్లి పోలీసులు కేసు కూడా నమోదు చేయకపోవడం గమనార్హం.
- 2011లో జూనియర్ కళాశాలలో ప్రశ్నపత్రాలకు సంబంధించి సెక్యూరిటీ కోసం పేపర్ గార్డ్‌గా ఉన్న ఇస్మాయిల్ విషయంలోనూ మరో ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఇస్మాయిల్ తనను తాను కాల్చుకుని మృతి చెందారు. ఎంటీ సెక్షన్‌లో ఉండే తాను హెడ్‌కానిస్టేబుల్‌గా ఉంటూ గార్డు డ్యూటీ వరుసగా మూడు నెలలు వేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారు.
- 2014లో కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయంలో ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందారు. దాదాపు 28 ఏళ్ల తరువాత డ్యూటీకి వచ్చిన ఆయన మిస్‌ఫైర్ కావడంతో మృతి చెందారు.
- 2016లో పాత డీపీఓ ఆఫీస్‌లో మరోసారి మిస్ ఫైర్ అయింది. డ్యూటీకి వెళ్లిన సమయంలో ఓ కానిస్టేబుల్ లోడ్ చేసుకుని, రౌండ్స్ తీసుకెళ్తారు. తిరిగి గన్ ఇచ్చే సమయంలో వాటిని తీయలేదు. చెక్ చేసే సమయంలో మిస్ ఫైర్ అయి గోడకు తగిలింది. పాతది కావడంతో అది కొంత చీలిపోయింది.
- 2022లో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ పోలీస్ సిబ్బంది స్వాతంత్ర్య దినోత్సవానికి డెమో నిర్వహించారు. ఈ సమయంలో ఓ కానిస్టేబుల్‌కు రబ్బరు బుల్లెట్ తగలడంతో కాలికి గాయమైంది.

కలెక్టరేట్‌లో పేలిన రైఫిల్

ఏఆర్ హెచ్‌సీకి గాయం

అనంతపురం కలెక్టరేట్‌లో గన్ మిస్ ఫైర్ అయింది. ఏఆర్ హెడ్ కా నిస్టేబుల్ సుబ్బరాజు ఛాతీ పక్క నుంచి బుల్లెట్ దూ సుకువెళ్లింది. ఆయనకు తీవ్ర గాయమైనా.. ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున 4.45 గంటలకు చోటుచేసుకుంది. కలెక్టర్‌లోని ట్రెజరీ గార్డుగా ప నిచేస్తున్న సుబ్బరాజు శుక్రవారం తెల్లవారుజామున విధుల్లోకి వెళ్లారు. ఈ క్రమంలోనే తన వద్దనున్న 303 రైఫిల్‌ను క్లీన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలింది. ఛాతి పక్క నుంచి బుల్లెట్ అవతలి వైపుకు దూసుకెళ్లింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో సుబ్బరాజే తన సోదరుడికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. అతడు వచ్చి హుటాహుటిన అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించాడు. వైద్యులు సర్జరీ చేసి ప్రాణాపాయం లేదని తెలియజేశారు. ఎస్పీ జగదీష్ సుబ్బరాజును పరామర్శించారు. ఘటనపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గతంలో సుబ్బరాజును రెండుసార్లు సస్పెండ్ చేశారు. అప్పులు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ క్రమంలో ఆత్మహత్యకు ప్రయత్నం చేశారేమో అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

విషజ్వరంతో చిన్నారి మృతి


ఆరాధ్య (ఫైల్)

ఉరవకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివరా మిరెడ్డి కాలనీకి చెందిన ఆరాధ్య(7) అనే చిన్నారి విషజ్వరంతో మృతి చెందింది. ఆ కాలనీకి చెందిన మారుతి, మహేశ్వరి దంపతుల కుమార్తె ఆరాధ్యకు వారం రోజుల క్రితం జ్వరం వచ్చింది. స్థానిక ఆసుపత్రిలో చూపించినా జ్వరం తగ్గకపోవడంతో నాలుగు రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. బెంగళూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. చిన్నారి వైద్యం కోసం రూ.6 లక్షల దాకా ఖర్చు చేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

పశుసంవర్ధక శాఖ విశ్రాంత జేడీపై చర్యలు

ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ నిలిపివేత

అనంతపురం అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ విశ్రాంత జేడీ సుబ్రహ్మణ్యం పదవీ విరమణ బెనిఫిట్స్‌ను నిలిపివేస్తూ ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2020-21లో ఆయన డీడీ హోదాలో ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌గా పనిచేశారు. ఆ సమయంలో జిల్లాలోని మూడు ప్రాథమిక సహకార సంఘాలకు సరఫరా చేసిన ఎరువుల బకాయిలు ఉండటంతో పదవీ విరమణ బెనిఫిట్స్‌ను ఆపేశారు. ఆయా సంస్థల నుంచి బకాయిలు వచ్చే దాకా బెనిఫిట్స్ ఇవ్వరు. విడపకల్లు మండలం కొట్టాలపల్లి ప్రాథమిక సహకార సంఘానికి సరఫరా చేసిన ఎరువుల్లో ప్రస్తుతం రూ.23 లక్షలు బకాయి ఉంది. వజ్రకరూరు మండలం పొట్టిపాడుకు చెందిన మన వజ్రకరూరు ఎఫ్‌పీఓకు రూ.16 లక్షల విలువైన ఎరువులు స్ఱరఫరా చేయగా ప్రస్తుతం రూ.3.50 లక్షలు బకాయి ఉంది. గుమ్మగట్ట ఎఫ్ఎస్‌సీఎస్ రూ.1.20 లక్షలు బకాయి ప డింది. ఈ నేపథ్యంలోనే బకాయిలకు సం బంధించిన నోటీసులును ఆయనకు ఏపీ మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు పంపినట్లు స మాచారం. ఆయన నుంచి సమాధానం రాక పోవడంతో పశుసంవర్ధక శాఖ రాష్ట్ర ఉ న్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన పదవీ విరమణ బెనిఫిట్స్‌ను ఆపేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపిక


అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుంతకల్లు టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం కంప్యూటర్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఇందు ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపునకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 12నుంచి 21 వరకు మహారాష్ట్రలోని జాల్గావ్‌లో నిర్వహించే ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపునకు ఇందు ఎంపికైందని తెలిపారు. ఢిల్లీలో జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపునకు కూడా ఆమె ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

అనంతపురం విద్య, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్న సంస్థలు, వ్యక్తులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బాలల సంక్షేమ సంఘం జిల్లా పర్యవేక్షణాధికారి పారూక్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి లేదా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందడం ద్వారా లేదా ప్రభుత్వ నిధులు పొందకుండా గానీ నడుపుతున్న బాలల సంరక్షణ కేంద్రాలన్నీ జువైనల్ జస్టిస్ చట్టం- 2015 సెక్షన్ 41 మేరకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్, చిరునామా, అర్హతలు, జతపరచాలని, డాక్యుమెంట్లు చెక్‌లిస్టు మొదలైన వివరాలన్నీ http ://wdcw.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే...ఏడాది జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధిస్తారని హెచ్చరించారు.

7న కమిషనర్ కార్యాలయంలో సమావేశం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కమిటీ అసెట్స్ గ్రామ పంచాయతీ నిర్మాణంలో చేపట్టే అభివృద్ధి పనులపై 7వ తేదీన కమిషనర్ కార్యాలయంలో జడ్పీ సీఈఓ, డీపీఓలకు సమీక్ష నిర్వహిస్తున్నట్లు డీపీఓ నాగరాజునాయుడు తెలిపారు. ఏఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నది ఇప్పటికే నిర్ణయించామన్నారు. పైప్‌లైన్, బస్‌షెల్టర్ ఏర్పాటు, ఓఎల్ఎస్ఆర్ మరమ్మతులకు సంబంధించి 2024-25 మార్చి చివరికి వీటన్నింటినీ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపైనా చర్చిస్తామన్నారు.

మహిళలకు ఉచితంగా వంటగ్యాస్

- కూటమి హామీ అమలు
- జిల్లాలో 28వేల మంది బుకింగ్
- అట్టహాసంగా పంపిణీకి శ్రీకారం

అనంతపురం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి తరపున టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మహిళలకు ఏడాదికి మూడు ఉచితంగా వంటగ్యాస్ సిలిండర్లను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు దీపావళి పండుగను పురస్కరించుకొని కూటమి ప్రభుత్వం అమలుకు అడుగులు వేసింది. ఇందులో భాగంగా అక్టోబరు 29వ తేదీ నుంచి బుకింగ్ చేసుకుని అర్హులందరికీ తొలిసారిగా గ్యాస్ సిలిండర్ల పంపిణీకి నిర్ణయం తీసుకుంది. జిల్లాలో అధికారిక లెక్కల మేరకు 28వేల మంది ఉచితగ్యాస్ కోసం బుకింగ్ చేసుకున్నారు. వీరందరికీ శుక్రవారం నుంచి ఉచితంగా సిలిండర్లు పంపిణీకి శ్రీకారం చట్టారు. అనంత జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోను ప్రజాప్రతినిధులు, అధికారులు ఉచితగ్యాస్ సిలిండర్ల పంపిణీని అట్టహాసంగా చేపట్టారు. ఉరవకొండలో కలెక్టర్ వినోద్ కుమార్ చేతులు మీదుగా సిలిండర్లను మహిళలకు అందజేశారు. అనేక ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం పాల్గొని ఉచిత గ్యాస్ పంపిణీని కొనసాగించారు. బుకింగ్ చేసుకొని సిలిండర్ పొందిన మహిళలకు తిరిగి ఆ సొమ్ము 48 గంటల్లో వారి ఖాతాల్లోకి జమ అవుతుందని డీఎస్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. తొలివిడత బుకింగ్‌కు మార్చి 31వరకు బుకింగ్‌చేసుకొని ఉచిత గ్యాస్ సిలిండర్ పొందవచ్చన్నారు. అవసరం ఉన్నపుడు మాత్రమే బుక్ చేసుకున్నా సిలిండర్‌ను ఇంటివద్దకే తెచ్చి ఇస్తారన్నారు.


మహిళలకు సిలిండర్లను అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పరమ పవిత్రం కార్తీకం

ఆలయాలు ముస్తాబు

నేటి నుంచి ప్రత్యేక పూజలు

అనంతపురం కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజ మాసం శుక్రవారం నాటికి ముగిసింది. సూర్యమానాన్ని అనుసరించి శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది. పూర్ణిమ కృత్తికా నక్షత్రంతో కూడి ఉన్నందున ఈ మాసానికి కార్తీకమాసమని పేరు. పరమశివుడు, శ్రీమహావిష్ణువులకు అత్యంత ప్రీతిపాత్రమైనది ఈ మాసం. అందుకే శివాలయాల్లో అభిషేకాలే కాక విష్ణు ప్రీతిగా తులసిపూజలూ నిర్వహించడం ఆనవాయితీ. కార్తీక మాసంలో తెల్లవారుజామునే లేచి తలారా స్నానం చేసి, శుభ్రమైన దుస్తులు ధరించి, తులసికోట ముందు భగవన్నామ సంకీర్తన చేస్తూ ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. కార్తీకమాసంలోనే శీతాకాలమూ ఆరంభమవుతుంది. నదీ, సముద్ర జలాల్లో దేహానికి అవసరమైన లవణాలు నిక్షిప్తమై ఉంటాయి. కనుక కార్తీకమాసంలో సూర్యోదయానికి ముందే స్నానాదులు ఆచరిస్తే రోగాలు దరిచేరవని శాస్త్రం చెబుతోంది.

ఆలయాలు ముస్తాబు..

కార్తీకమాస పూజలకు జిల్లా వ్యాప్తంగా ఆలయాలన్నీ సిద్ధమయ్యాయి. రోజూ పరమేశ్వరుడికి విశేష పూజలు, అభిషేకాలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతపురం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, ఆరో రోడ్డు సర్వేశ్వరాలయం, హెచ్చెల్సీ కాలనీ మంజునాథస్వామి దేవాలయం, చాముండేశ్వరి దేవాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమం, బెంగుళూరురోడ్డులోని శివకోటి దేవాలయం, పాతూరులోని విరూపాక్షేశ్వరాలయం తదితర ఆలయాలు కార్తీక మాస పూజలకు ముస్తాబయ్యాయి.


మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఎన్నో ప్రయోజనాలు



కార్తీకమాసంలో ఆచరించే చన్నీటి స్నానంతో పాటు భక్తిప్రపత్తులతో నిర్వహించే పూజాదులవల్ల మానసికంగానే కాక శారీరకంగానూ అనేక ప్రయోజనాలున్నాయి. దేవుడిపై గల భక్తిని మనసునిండా నింపుకుని వేకువజామునే చేసే చన్నీటి స్నానం వల్ల శారీరకోల్లాసం కలుగుతుంది. మానసికంగానూ ఎంతో దృఢంగా ఉండగలం. ఈ మాసంలో చేసే దీపారాధన ఏడాది మొత్తం చేసే దీపారాధనలతో సమానం. ఏడాది మొత్తం చేసే పూజాఫలం ఈ మాసంలో ఒక్కటే లభిస్తుందని పురాణాల సారాంశం.

\- నరసింహశాస్త్రి, పురోహితుడు, అనంతపురం

నేడు డీలర్ల సంఘానికి ఎన్నికలు

మూడు పదవులకు పోటీ

అభ్యర్థుల ముమ్మర ప్రచారం

అనంతపురం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘానికి శనివారం ఎన్నికలు జరగనున్నాయి. గతంలో గత నెల 23న అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులు ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు పోటీదారులు అంగీకరించలేదు. దీంతో అప్పట్లో కార్యక్రమం వాయిదా పడింది. అయినప్పటికీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఇద్దరు చొప్పున పోటీ పడుతున్నారు. దీంతో శనివారం ఉదయం 10 గం టలకు రజాక్ ఫంక్షన్ హాల్‌లోనే ఎన్నికలు నిర్వహిం చాలని ఆ సంఘం రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది.

ఆ మూడు పదవులకే..

డీలర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఇద్దరేసి చొప్పున డీలర్లు పోటీలో ఉన్నారు. ఉమ్మడి జిల్లా డీలర్ల సంఘం అధ్యక్ష పదవికి వెంకటేష్, పార్థసారథి పోటీలో ఉన్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి సిరిగుప్ప వెంకటేష్, భాస్కర్‌రెడ్డి, కోశాధికారి పదవికి రమేష్ రంగయ్య, వెంకట్‌బాబు పోటీలో పడుతున్నారు. మిగతా ఇద్దరు కార్యదర్శులను, ఇద్దరు ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నట్లు సమాచారం. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ అనివార్యం కావడంతో రహస్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని ఆ సంఘం నాయకులు నిర్ణయించారు. కొందరు డీలర్లను వ్యక్తిగతంగా కలిసి తమకే ఓటు వేయాలని కోరుతుండగా.. మరికొందరు ఫోన్ల ద్వారా అభ్యర్థిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠత డీలర్లల్లో నెలకొంది.

మట్టి అక్రమ రవాణా.. అర్ధరాత్రి ఉత్కంఠ

- ఎక్స్‌కవేటర్, నాలుగు ట్రాక్టర్ల సీజ్
- వదిలిపెట్టాలని అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు వైసీపీ నాయకుడు

యాడికి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుణాంపల్లి వద్ద వంకలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్‌ను బుధవారం అర్ధరాత్రి పోలీసులు సీజ్‌చేశారు. మట్టి అక్రమ వ్యాపారం చేస్తున్న వ్యక్తి వైసీపీ మండల నాయకుడి సమీప బంధువు కావడం గమనార్హం. బుధవారం అర్ధరాత్రి తిరుణాంపల్లి వంకలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో మైన్స్ అండ్ జియాలజీ అధికారులు దాడిచేసి నాలుగు ట్రాక్టర్లను యాడికి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్, నాలుగు ట్రాక్టర్లు వైసీపీ మండల నాయకుడి సమీప బంధువుకు చెందినవి కావడంతో ఆయన పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి వాటిని వదిలిపెట్టాలని కోరినట్లు తెలిసింది. మైన్స్ అండ్ జియాలజీ అధికారులు పోలీస్ స్టేషన్ వద్ద వదిలి వెళ్లారని తెలిపారు. ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను వదలాలని గురువారం కూడా సదరు నాయకుడు పోలీసుల వద్ద మంతనాలు జరిపినట్లు తెలిసింది. మైన్స్ అండ్ జియాలజీ అధికారులు తర్వాత పోలీస్‌స్టేషన్ వద్దకు రాలేదు. మట్టి రవాణాపై రెవెన్యూ అధికారులు సరైన ఆదేశాలు ఇవ్వలేదు. ఈ నాటకీయ పరిణామాల మధ్య వాల్టా చట్ట ఉల్లంఘన చేసి మట్టి అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులు కేసు నమోదుచేశారు.


సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు, తిరుణాంపల్లిలో వంకలో మట్టి తవ్విన దృశ్యం

నేటి నుంచి హనుమద్ దీక్ష


కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి

గుంతకల్లు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసారంభాన్ని పురస్కరించుకుని గుంతకల్లు మండలంలోని కసాపురం దేవస్థానంలో శనివారం హనుమద్ దీక్షలను ప్రారంభించనున్నారు. కసాపురం ఆలయంలో దీపావళి పర్వదినం అనంతరం కార్తీక పాడ్యమి తిథిన హనుమద్ దీక్షా పరులకు మాలాధారణ నిర్వహిస్తారు. శనివారం వేకువనే ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ అర్చకులు, వేద పండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా హనుమద్ మాలాధారణగావించి, మండల దీక్షలను ప్రారంభింపజేస్తారు. ఇదే నెల 22వ తేదీన కార్తీక బహుళ సప్తమి సందర్భంగా 20 రోజుల హనుమద్ అర్ధ మండల దీక్షలను ప్రారంభింపజేస్తారు. డిసెంబరు 12న హనుమద్ మండల, అర్ధ మండల దీక్షలను పూర్తిచేసిన మాలాధారులు కసాపురం దేవస్థానానికి వచ్చి ఇరుముడులను సమర్పిస్తారు. మరుసటి రోజు మార్గశిర శుద్ధ త్రయోదశి డిసెంబరు 13న ఆలయంలో హనుమద్వ్రత కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించి, మాలాధారుల దీక్షలను విరమింపజేస్తారు. హనుమద్ మండల దీక్షా ప్రారంభం స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన శనివారం రోజునే వచ్చినందున భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మాలలను ధరించాలని ఆలయ ఈఓ కె. వాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఒకే పోస్టుకు ఇద్దరు అధికారులు

వివాదంగా మారిన ఆన్‌సెట్ సీఈఓ నియామకం



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఒకే పోస్టుకు ఇద్దరు అధికారులను నియమించారు. దీంతో ఆన్‌సెట్ సీఈఓ నియామకం వివాదంగా మారింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 1836 ప్రకారం వెయిటింగ్‌లో ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవిశంకర్‌రెడ్డిని అనంతపురం ఆన్‌సెట్ సీఈఓ, జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు టూరిజం రీజనల్ డైరెక్టర్‌గా ఉన్న వెంకటేశ్వర్లుకు ఆన్‌సెట్ సీఈఓ, జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ పోస్టుకు ఎవరు చేరుతారో...ఎవరు బాధ్యతలు స్వీకరిస్తారనేది ఉత్కంఠ నెలకొంది.

అభివృద్ధి పనులకు కలెక్టర్ భూమిపూజ


రాగులపాడు వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కలెక్టర్

ఉరవకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలో కలెక్టర్ వినోద్ కుమార్ శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. తొలుత మండల కేంద్రంలోని రాజీవ్‌కాలనీలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేసి అక్కడి రికార్డులను పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి హాజరు కాకపోవడంతో షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. వెంకటాంపల్లిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన కందకాల పనులను పరిశీలించారు. అక్కడే ఉపాధి పథకం కింద ఆనంద్ అనే వ్యక్తి రూ.2.30 లక్షల వ్యయంతో చేపట్టిన పశువులషెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. రాగులపాడు సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో డ్వామా పీడీ సలీం బాషా, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ నయాజ్ అహ్మద్, ఎంపీడీఓ రవిప్రసాద్, డ్వామా ఏపీడీ శైలజ, టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి ఎస్ఈగా హరిప్రసాద్

పీఐయూ ఇన్‌చార్జి ఈఈగా ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖ (ఆర్ అండ్‌బీ) ఇన్‌చార్జి ఎస్ఈగా ఎన్‌హెచ్ ఎస్ఈగా పనిచేస్తున్న హరిప్రసాద్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ఈఎన్‌సీ నయీముల్లా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్ఈగా పనిచేస్తున్న ఓబుల్‌రెడ్డి గురువారం పదవీ విరమణ పొందారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని పీఐయూ ఈఈ కేవీకేవీ ప్రసాద్ కూడా పదవీ చేశారు. దీంతో పీఐయూ ఇన్‌చార్జి ఈఈగా అదే శాఖ పరిధిలోని అనంతపురం పీఆర్ఐ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ప్రభాకర్ రెడ్డిని నియమిస్తూ ఆ శాఖ ఈఎన్‌సీ బాలునాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయా స్థానాల్లో వారు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

పల్లెదారుల్లో ఇక పరుగులు

గ్రామీణ రోడ్లకు నూతన శోభ

గ్రామీణ రహదారుల్లో ఇక పరుగులు తీయవచ్చు. నిన్నటి వరకూ గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డ గ్రామీణులు నూతన రహదారులతో సులభంగా ప్రయాణం చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం జిల్లాలో శరవేగంగా జరుగుతోంది. వర్షాలు కురిసినా ఎక్కడా సీసీరోడ్లు, బీటీ రోడ్ల పనులు ఆపలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎక్కడికక్కడ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. పల్లె రోడ్లకు కూటమి ప్రభుత్వం జిల్లాలో రూ. 100 కోట్లు కేటాయించి 1521 రోడ్లకు శ్రీకారం చుట్టింది. ఇందులో సీసీ రోడ్లు 1515, బీటీ రోడ్లు 6 ఉన్నాయి. ఇప్పటికే వెయ్యికి పైగా రోడ్ల పనులను ప్రారంభించారు. -ఆంధ్రజ్యోతి, అనంతపురం సిటీ

- వారం రోజుల్లోనే 70 శాతం పనులు ప్రారంభం
- సంక్రాంతికి పూర్తి చేయడమే లక్ష్యం
- రోడ్లను విస్మరించిన వైసీపీ



పల్లె పండుగలో రాజీవ్‌కాలనీలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

పల్లె రోడ్లను విస్మరించిన వైసీపీ

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ పల్లె రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు కూడా చేయని దుస్థితి. తద్వారా ఎక్కడికక్కడ రోడ్లు అధ్వానస్థితికి చేరి ఆయా ప్రాంతాల ప్రజలు అవస్థల నడుమ రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాలు కురిసిన సమయాల్లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. మరికొన్ని ప్రాంతాల్లో గుంతల రోడ్లతో తీవ్ర ఇబ్బందులు పడేవారు.

సందడిగా ప్రారంభం

అనంతపురం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో రోడ్డు పనులను సందడిగా ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. పల్లె రోడ్లకు రూ.100 కోట్ల నిధులను మంజూరు చేశారు. దీంతో అక్టోబరు 14 నుంచి ఆయా ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు రోడ్లకు భూమి పూజలు చేశారు. వారం రోజుల్లోనే 1521 రోడ్లలో 1000 రోడ్లకు పైగా (70శాతం) పనులకు భూమి పూజ చేశారు. ఈ పనులన్నింటినీ సంక్రాంతి పండుగలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ దిశగా ఆ శాఖ అధికారులు, సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. రోడ్లన్నీ పూర్తయితే సంక్రాంతికి పల్లె రహదారులకు నూతన శోభ రానుంది.



వేగంగా పనులు చేయిస్తున్నాం

ప్రభుత్వ ఆదేశాలు మేరకు.. మంజూరు చేసిన నిధులతో జిల్లా వ్యాప్తంగా సీసీ, బీటీ రోడ్ల పనులను వేగవంతంగా చేయిస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా పనులను చేయిస్తున్నాం. ఎక్కడా నాణ్యత తగ్గకుండా చూస్తున్నాం. రోడ్లన్నీ పూర్తయితే పల్లె ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, పంచాయతీ రాజ్‌శాఖ

రోజువారీగా సమీక్షిస్తున్నాం

పల్లె పండుగ కార్యక్రమంలో చేస్తున్న పనులపై ప్రతిరోజూ ఆరా తీసి వేగంగా పనులు జరిగేలా చూస్తున్నాం. మంత్రులు, ఎమ్మెల్యేలతో భూమి పూజ చేయించి పనులను ప్రారంభించాం. లక్ష్యం ప్రకారం సంక్రాంతి పండుగ లోపు జిల్లాలో రోడ్ల పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా చూస్తాం.

- ప్రభాకర్‌రెడ్డి, ఈఈ, పంచాయతీ రాజ్‌శాఖ



అధికారుల అత్యుత్సాహం

- పంచాయతీ కార్యదర్శులకు తిప్పలు
- గాలిలో 73 మంది..
- వేతనాలు అందక లబోదిబో
- పట్టించుకోని ఉన్నతాధికారులు



డీపీఓ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారుల అత్యుత్సాహంతో పలువురు పంచాయతీ కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల కార్యదర్శులు వేతనాలు అందక లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారులు తమ స్థానాన్ని పదిలం చేసుకోవడానికి నాడు రాజకీయ సిఫార్సులకు తలొగ్గి సమస్యలు తెచ్చిపెట్టి ఆఖరికి గాలిలో నిలబెట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ రాక ముందు పంచాయతీల్లో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు నాలుగు గ్రేడ్స్‌లో కార్యదర్శులు ఉండేవారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సచివాలయ వ్యవస్థలో భాగంగా గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శుల నియామకానికి శ్రీకారం చుట్టింది. నూతనంగా నియమితులైన వారికి అప్పటికే గ్రేడ్-4 వరకు ఉన్న కార్యదర్శులతో సమానంగా డీడీఓ పవర్స్ ఇచ్చి ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండేలా చర్యలు తీసుకోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పంచాయతీల సంఖ్య కంటే కార్యదర్శులు ఎక్కువగా ఉండడంతో కొందరు కార్యదర్శులు గ్రేడ్స్‌కు అతీతంగా గాలిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 1044 పంచాయతీలు ఉన్నాయి. వీరిలో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు 605 మంది ఉన్నారు. సచివాలయ కార్యదర్శులు గ్రేడ్-5కు 512 మంది ఎంపికయ్యారు. దీంతో కార్యదర్శుల సంఖ్య 1117కు చేరింది. జిల్లాలో పంచాయతీల సంఖ్య కంటే 73 మంది అదనంగా ఉన్నారు. వీరిలో చాలా మందికి ప్లేస్‌మెంట్స్ లేకపోవడంతో వేతనం మంజూరు కాని పరిస్థితి ఏర్పడింది. జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది నానాతంటాలు పండి కొంత మందికి వెసులుబాటు కల్పించారు. మిగిలిన వారి పరిస్థితి అయోమయంగా ఉంది. గతంలో బదిలీల ప్రక్రియ చేపట్టిన అధికారులు ప్రస్తుతం లేరు. ప్రస్తుత డీపీఓ నుంచి మిగిలిన సిబ్బంది అందరూ కొత్తవారు కావడంతో గతంలో చేసిన తప్పిదాలను తామెందుకు సరిదిద్దాలన్న ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. నూతన డీపీఓ నాగరాజనాయుడు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని బాధిత కార్యదర్శులు కోరుతున్నారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

రిజర్వేషన్ బుకింగ్ నూతన విధానం ప్రారంభం

గుంతకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైల్వేలో రిజర్వేషన్ టికెట్ 60 రోజుల ముందు నుంచి అడ్వాన్స్ బుకింగ్ చేసుకునే నూతన విధానం శుక్రవారం ప్రారంభమైంది. నిన్నటి వరకూ 120 రోజుల ముందు టికెట్ రిజర్వేషన్ చేసుకునే విధానం (అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్) అమల్లో ఉండేది. రైల్వే మంత్రిత్వశాఖ 120 రోజుల ముందు రిజర్వేషన్ చేసుకునే కాల పరిమితిని సగానికి కుదించి 60 రోజుల ముందు నుంచే రిజర్వేషన్ చేసుకునే విధంగా నిబంధనలను మార్చడానికి గత నెలలో నిర్ణయించింది. ట్రెయిన్ బెర్త్ రిజర్వేషన్‌లో జరుగుతున్న అక్రమాలను తొలగించడం కోసం ఈ విధానాన్ని అమలులోకి తెస్తున్నట్లు రైల్వే శాఖ పేర్కొంది. ఈ మేరకు నవంబరు 1వ తేదీ నుంచి మార్పుచేసిన విధానం అమల్లోకి వచ్చింది.

1085 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1085 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,079 క్యూసెక్కులు వెళుతోందన్నారు. ప్రస్తుతం 1.664 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఖాకీ వెన్నులో వణుకు

గ్యాంగ్ రేప్ కేసు నిందితులను లోతుగా విచారించిన ఉన్నతాధికారులు

- పలువురు పోలీసు సిబ్బంది సహకారాన్ని బయటపెట్టినట్లు సమాచారం
- ఆ శాఖలో కలవరం
- జాబితాలో తామున్నామా అంటూ ఆరా..
- సస్పెన్షనా.. బదిలీనా.. అని చర్చ
- పురంలో హాట్ టాపిక్‌గా విచారణ

చిలమత్తూరు మండలంలో గ్యాంగ్‌రేప్ కేసులో నిందితులు, మోస్ట్‌వాంటెడ్ అంతర్రాష్ట్ర దొంగలను ఉన్నతాధికారులు లోతుగా విచారించడం ఖాకీల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నిందితులపై పదుల సంఖ్యలో చోరీలు, దోపిడీలు, అత్యాచారం కేసులున్నా వారు దర్జాగా బయట ఎలా తిరుగుతున్నారన్న దానిపై ఉన్నతాధికారులు కూపీ లాగినట్లు తెలిసింది. ఇందులో తమకు సహకరించిన పోలీసుల బండారాన్ని నిందితులు బయటపెట్టినట్లు సమాచారం. వారు చెప్పిన విషయాలు విని, పోలీసు ఉన్నతాధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. నిందితులు వెల్లడించిన మేరకు వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన పోలీసు సిబ్బంది వెన్నులో వణుకు పుడుతోంది. ఈ నేపథ్యంలో కొంతమందిపై వేటు పడే అవకాశం ఉంది. ఇదే హిందూపురంలో ప్రస్తుతం పోలీసు శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది.



హిందూపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) ఇటీవల సంచలనం రేకెత్తించిన సామూహిక అత్యాచారం కేసులో పట్టుబడిన నిందితులు పేరుమోసిన, మోస్ట్ వాంటెడ్ అంతరాష్ట్ర నేరస్తులు. దీంతో పోలీసు ఉన్నతాధి కారులు.. వారిని అదుపులోకి తీసుకుని, సామూహిక అత్యాచారం కేసుతోపాటు పాత వాటిపై లోతుగా విచారించినట్లు తెలిసింది. నిందితులు కొన్నేళ్లుగా దోపిడీలు, అత్యాచారాలు, చోరీలు చేస్తుండడం, పోలీసులకు పట్టుబడినా జైలు నుంచి వచ్చి మళ్లీ కొనసాగిస్తుండటంపై ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి రహస్యంగా విచారణ చేపట్టారు. పోలీసు సిబ్బందిపైనే దిమ్మతిరిగే విషయాలను నిందితులు ఉన్నతాధికారులకు చెప్పడంతో వారు నివ్వెరపోయినట్లు తెలిసింది. అందుకే ఇన్నేళ్ల పాటు పేరుమోసిన దొంగలు, అంతరాష్ట్ర ముఠా హిందూపురంలో దర్జాగా తిరుగుతున్నట్లు వెల్లడైందని సమాచారం. వారికి కొంతమంది పోలీసు సిబ్బంది సలాం కొట్టడం, వారితోనే చేతులు కలపడం వెరసి నిందితులు అత్యాచారాల వైపు వెళ్లారని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు.



లోతుగా విచారించిన ఉన్నతాధికారులు

సామూహిక అత్యాచారం కేసులో పట్టుబడిన నిందితులు పాత నేరస్తులు కావడంతో వారిని పలు కేసుల్లో విచారించారు. అందులో గంజాయి, కొత్తరకం డ్రగ్స్, అత్యాచారాలు, దోపిడీలు, చోరీలపై ఆరాతీశారు. ఇన్ని కేసుల్లో నిందితులై ఉండి దర్జాగా ఎలా బయట తిరుగుతున్నారని ఓ ఉన్నతాధికారి ప్రశ్నించగా.. అప్పుడు కొంతమంది సిబ్బంది బాగోతం బయటపెట్టినట్లు తెలిసింది. నిందితులు పట్టుబడినపుడు వారిని బయటకు తీసుకురావడానికి కొంతమంది గ్రూపుగా ఏర్పడి, బెయిల్‌కు కావాల్సిన ఖర్చు భరించేవారని పోలీసు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. నిందితులు బయటకు వచ్చాక మరో నేరం చేసి బెయిల్‌కు పెట్టిన ఖర్చుకు రెండింతలు ఇచ్చేవారని సమాచారం. ఈ బెయిల్‌కు బయట నుంచి సహకరించేవారిలో ఒకరిద్దరికి బంగారు వ్యాపారులతో సత్సంబంధాలున్నట్లు సమాచారం. వారు బయటకు వచ్చాక మరో చోరీగానీ, నేరంగానీ తద్వారా వచ్చిన సొమ్ములో నిందితులకు ఇచ్చేది కొంతే. మిగిలింది మొత్తం బెయిల్‌కు ఖర్చుపెట్టిన వారికే ఇవ్వాల్సి వచ్చేదని విచారణలో ఒప్పుకున్నట్లు సమాచారం. అంతేకాక పోలీసు సిబ్బంది కూడా నిందితులకు పరోక్షంగా, ప్రత్యక్షంగా సహకరించినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది.

జాబితాలో మేమున్నామా?

సామూహిక అత్యాచారం కేసు నిందితులను ఉన్నతాధికారులు విచారించిన సమయంలో వారు కొంతమంది పోలీసు సిబ్బంది పేర్లు వెల్లడించినట్లు తెలిసింది. అత్యాచారం కేసులో పట్టుబడిన ఒకరిద్దరు నిందితులు గతంలో హిందూపురం మండలంలో జరిగిన ఓ కీలక కేసులో తమను తప్పించినట్లు ఉన్నతాధికారికి లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చినట్లు సమాచారం. వారు చెప్పిన జాబితాలో హిందూపురంలోని మూడు పోలీసు స్టేషన్ల పరిధిలో ఆరేడుగురి సిబ్బంది వ్యవహారాలు బట్టబయలు చేసినట్లు సమాచారం. నిందితులు చెప్పిన జాబితాలో తామున్నామా అంటూ పోలీసు సిబ్బంది చర్చించుకుంటున్నారు. వారు చెప్పిన జాబితాలో ఉన్న సిబ్బంది ఇప్పటికే తమపై వేటు పడుతుందని అంచనాకు వచ్చేశారు. దీంతో తాము హిందూపురం వదిలి వేరే చోటికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని ముందుగానే చెప్పుకుంటున్నారు. నిందితులకు సహకరించిన ఒకరిద్దరు కానిస్టేబుళ్లు తమ విషయం ఎలాగూ బయటకు వస్తుందన్న ఉద్దేశంతో ఒకరిద్దరు అధికారులు, మరికొంత సిబ్బంది మీద ఉన్నతాధికారికి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేసినట్లు చర్చ సాగుతోంది. తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి ఆరోపణలు చేసినట్లు ఉన్నతాధికారుల రహస్య విచారణలో వెల్లడైంది. దీంతో సదరు సిబ్బందిపై ఉన్నతాధికారులు గుర్రుగా ఉన్నారని తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర హోంశాఖ మంత్రి, డీజీపీ త్వరలో రానున్నారు. వారు వచ్చి వెళ్లాక వారంలోపే జిల్లాలో పోలీసు బదిలీలున్నాయి. ఈ బదిలీల్లో ఉన్నతాధికారులు గుర్తించిన సిబ్బందిపై వేటు వేస్తారా, శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తారా అన్నది కొన్నిరోజుల్లో తేలనుంది. ఏది ఏమైనా అత్యాచారం కేసు నిందితుల విచారణ పోలీసుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది.

ఎర్రచందనం కేసులో వైసీపీ నాయకుడి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

నంబులపూలకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడబల్లి గ్రామ సమీపంలో విశ్వనాథ్‌రెడ్డి పొలంలో బయటపడిన ఎర్రచందనం దుంగల కేసులో అదే ఊరికి చెందిన వైసీపీ నాయకుడు మహేశ్వర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ వలీబాషా స్థానిక స్టేషన్‌లో శుక్రవారం వెల్లడించారు. గతంలో ఎర్రచందనం దుంగలను పొలంలో డంప్ చేశారు. వాటిని గత నెల 27న తరలించేందుకు ప్రయత్నించగా.. పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెళ్లగా దుండగులు వాటిని వదిలేసి, పరారయ్యారు. పోలీసులు.. దుండగలను స్వాధీనం చేసుకున్నారు. 275 కేజీలు బరువున్న 21 దుంగలను పట్టుకున్నారు. వాటి విలువ రూ.5.50 లక్షలుగా లెక్కగట్టారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా పెడబల్లి బస్టాండు వద్ద శుక్రవారం నిందితుడు అదే ఊరికి చెందిన మహేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేశారు. పరిపోయిన మిగతా నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ వెల్లడించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ హత్య



మెహతాజ్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వివాహేతర బంధం హత్యకు దారితీసింది. ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్లకు చెందిన మెహతాజ్ (32)ను ఆమె ప్రియుడు ఇర్ఫాన్ గురువారం రాత్రి హత్య చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొండకమర్లకు చెందిన గొర్ల అల్లాబక్ష పెద్దకుమార్తె మెహతాజ్‌ను అదే గ్రామానికి చెందిన బాబ్‌జాన్‌కిచ్చి 14 ఏళ్ల క్రితం వివాహం చేశారు. ఈమెకు మండలంలోని డబురువారిపల్లికి చెందిన చెందిన ఇర్ఫాన్‌తో వివాహేతర బంధం ఏర్పడింది. మెహతాజ్.. మరొకరితో వివాహేతర బంధం కొనసాగిస్తోందని ఇర్ఫాన్ అనుమానం పెంచుకున్నాడు. ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో రెండ్రోజుల క్రితం మెహతాజ్.. పిల్లలతో కలిసి పుట్టింటికెళ్లింది. ఇర్ఫాన్ పథకం ప్రకారం గతనెల 31వతేదీ రాత్రి మెహతాజ్ ఇంట్లోకి వెళ్లాడు. ఆమెతో గొడవపడి గొంతునులిమి చంపేశాడు. ఇంటివెనుకవైపు నుంచి పారిపోయాడు. తరువాత గుర్తించిన కుటుంబీకులు.. పోలీసులకు సమాచారం అందించారు. హత్యాస్థలాన్ని డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామనీ, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. మెహతాజ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్యాయత్నం

బత్తలపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు గ్రామానికి చెందిన దంపతులు శ్రీరాములు, అశ్విని కుటుంబ కలహాలతో బుధవారం రాత్రి ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీరాములు తాగుడుకు బానిసై, రోజూ భార్యతో గొడవపడేవాడు. బుధవారం రాత్రి కూడా గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన అశ్విని విషయం తాగగా.. శ్రీరాములు ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వారి పిల్లలు గట్టిగా ఏడ్వడంతో చుట్టుపక్కల వారు వచ్చి, క్రిమిసంహారక మందు తాగి పడివున్న అశ్విని, ఉరికి వేలాడుతున్న శ్రీరాములును కిందికి దించి బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అశ్విని కోలుకోగా.. శ్రీరాములు చికిత్స పొందుతున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చంద్రబాబు చేతిలో రైతాంగం దగా

- అన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చాలి
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రైతాంగం ప్రకృతి చేతిలోనే కాదు.. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల్లోనూ దగా పడిందని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. చంద్రబాబు మారలేదని, రైతాంగాన్ని ఆదుకునే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ జిల్లా కార్యలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్‌లో వర్షాభావం కారణంగా ఉమ్మడి జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. అయినా ఉమ్మడి జిల్లాలో 17 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించి చేతులు దులుపుకోవడం భావ్యం కాదని అన్నారు. తక్షణం ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పుడే కేంద్ర బృందం పర్యటించి, రైతులను ఆదుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ముగ్గురు మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని ఆయన కోరారు.

పోలవరం ఎత్తుపై..

పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని అనంత అన్నారు. ఈ విషయంలో చంద్రబాబు మరోసారి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పోలవరం ఎత్తు 45.72 మీటర్లు ఉంటే సుమారు 195 టీఎంసీలు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అలా కాకుండా 41.15 మీటర్లకు పరిమితం చేస్తే గరిష్ఠంగా 115 టీఎంసీలు మాత్రమే నిల్వ అవుతుందని అన్నారు. ఇదే జరిగితే పోలవరం వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ ఎత్తును తగ్గిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నా, ఏపీకి చెందిన కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రాయలసీమకు కృష్ణా జలాలల కోసం గతంలో అనేక ఉద్యమాలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టు వల్ల నేరుగా రాయలసీమకు లబ్ధి కలగకపోయినా పరోక్షంగా ప్రయోజనం ఉంటుందని అన్నారు. శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు నాగార్జున సాగర్‌కు వెళ్తున్నాయని, పోలవరం పూర్తయితే ఆ నీటిని రాయలసీమకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్లతోనే నిర్మిస్తామని ప్రధాని నరేంద్రమోదీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. లేదంటే కూటమి పార్టీలు, ప్రజాప్రతినిధులు మరోసారి రాష్ట్రానికి ద్రోహం చేసిన వారవుతారని అన్నారు.

పరిగి చెరువు పరవళ్లు



హిందూపురం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పరిగి మండలకేంద్రం సమీపంలోని చెరువు వరద నీటితో పూర్తిగా నిండి, మరువ పోతోంది. శుక్రవారం హోరుగా మరువ పారుతుండడంతో చుట్టుపక్కల గ్రామాలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఇటీవల కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు కుముద్వతి, జయమంగళి ప్రవహించాయి. ఆ నదుల నీరు పరిగి చెరువుకు చేరుతోంది. శుక్రవారం చెరువు పూర్తిగా నిండి, మరువ నీరు పరవళ్లు తొక్కుతోంది.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య



బొమ్ము అనిల్ కుమార్ (ఫైల్)

రాప్తాడు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాప్తాడు పంచాయతీ పరిధిలోని ముస్లిం మైనార్టీ కాలనీలో అప్పుల బాధ తాళలేక బొమ్ము అనిల్ కుమార్(41) ఉరి వేసుకున్నాడు. అనిల్‌కుమార్ మట్టి పెల్లల ఫ్యాక్టరీని నిర్వహించేవాడు. వ్యాపారం సరిగా నష్టపోయాడు. వ్యాపారం, కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బంది పడ్డాడు. అప్పుల వారి నుంచి ఒత్తిడి ఎక్కువైందని కుటుంబ సభ్యుల వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కందుకూరు రోడ్డులోని రేకులషెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య హేమ చంద్రిక, కుమారుడు లక్ష్మీ నితిన్, కూతురు హిమవర్షిణి ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

4న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక

పుట్టపర్తి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ, శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం పుట్టపర్తికి వస్తున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి సాయి ఆరామంలో ఉదయం పది గంటలకు నిర్వహించే ఎన్డీఏ కూటమి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.

9లోగా దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 9వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రస్తుతం 8, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు నవోదయ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

వైసీపీ నాయకుడి మట్టి దందాపై చర్యలు తీసుకోండి

తహసీల్దార్‌కు టీడీపీ నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

యాడికి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మట్టి దందా చేస్తున్న వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం టీడీపీ నాయకులు మండలకేంద్రంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు మాట్లాడుతూ... యాడికి గ్రామ పంచాయతీ పరిధిలో వైసీపీ మండల కన్వీనర్ మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ దందా కొనసాగిస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లుగా మట్టి అక్రమ వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. ఆయన అక్రమంగా వేసిన లేఔట్‌లోకి ప్రభుత్వభూములు, వంకల్లోని మట్టిని పెద్దఎత్తున తరలించి సొమ్ముచేసుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అనధికార లేఔట్లు లెక్కలేనన్ని వేశారని తెలిపారు. వైసీపీ నాయకుడి మట్టి దందాపై విజిలెన్స్ అధికారులచేత విచారణ చేయించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు లక్ష్మణ్, ఆదినారాయణ, నాగశేఖర్, విజయ్, చంద్రశేఖర్, మధురాజు, నాగమునిరెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా..

కేజీబీవీలో డ్రైడే

గాండ్లపెంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లి క్రాస్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో శుక్రవారం డ్రైడే నిర్వహించినట్లు వైద్యాధికారి మహేశ్వర్‌మారుతి చెప్పారు. బాలికలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మురుగునీటి కాలువల్లో దోమల నివారణకు బ్లీచింగ్ చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనియట్ అధికారి రామాంజనేయులు, సూపర్‌వైజర్ మహబూబ్‌బాషా, ఉపేంద్రారెడ్డి, సీహెచ్‌ఓ లక్ష్మీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

నంబులపూలకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటిపట్టాలివ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందించిన వారు మాట్లాడారు. అద్దె ఇళ్లలో నివాసముంటూ.. అద్దెలు కట్టలేక పేదలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇళ్లు లేనివారిని ప్రభుత్వం గుర్తించి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రమణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

తనకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల కమిటీని స్థానిక ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం ఎన్నిక చేశారు. మండల అధ్యక్షుడిగా ఖాజామొహిద్దీన్, ప్రధాన కార్యదర్శిగా గణేష్, గౌరవాధ్యక్షుడిగా రాజారెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకటశివరామక్రిష్ణ, గౌసియా, కోశాధికారిగా మహమ్మద్‌షరీఫ్, జిల్లా కౌన్సిలర్లగా సంతోష్‌కుమార్, బాబ్‌జాన్, శివశంకర్‌రెడ్డిను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, పరిశీలకులుగా కార్యదర్శి వైవి.సుబ్బారెడ్డి, అడిట్ అధికారిగా ఆజాంబాషా వ్యవహరించారు.

మొరాయించిన సర్వర్

ఓబుళదేవరచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సర్వర్ మొరాయించడంతో శుక్రవారం మండల మండలంలో పింఛన్ల పంపిణీ ఆలస్యం జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొన్నిచోట్ల సర్వర్ పనిచేయలేదు. అనంతరం మధ్యాహ్నం నుంచి సర్వర్ పనిచేయడంతో పింఛన్లను పంపిణీ చేశారు.

10న వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ

కదిరి అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ వద్ద వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 10న నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో దీనికి తరలివచ్చి విజయవంతం చేయాలని వడ్డెర సంక్షేమ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విగ్రహావిష్కరణ చేస్తారని, ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి బస్టాండ్‌కు వరకు భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గంగయ్య, రమణ, ఉద్యోగ సంఘం శ్రీనివాసులు, గోవర్ధన్, రమణ, మునిస్వామి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్ఐగా లక్ష్మీదేవి



నల్లచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల ఆర్ఐగా లక్ష్మీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె సోమందెపల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి ఆర్ఐ అశోక్ గాండ్లపెంటకు బదిలీ అయ్యారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

నల్లమాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానికంగా దినసరి కూలీగా పనిచేస్తున్న వడ్డె గంగరాజు అనారోగ్యంతో మృతిచెందారు. శుక్రవారం అతని మృతదేహానికి టీడీపీ నాయకుడు సామకోటి ఆదినారాయణ నివాళ్లు అర్పించారు. బాధిత కుటుంబానికి రూ.పదివేలు ఆర్థికసాయం అందచేశారు.

క్రైం న్యూస్

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



హరేరామ్ (ఫైల్)

ధర్మవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఎల్ఆర్ కాలనీకి చెందిన హరేరామ్ (48) శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను రెండు సంవత్సరాలుగా పక్షపాతంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను డీఎల్ఆర్ కాలనీ సమీపంలో రైల్వేట్రాక్ పై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు హిందూపురం రైల్వేపోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హరేరామ్ ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేసేవాడు. అతడికి భార్య అశ్వత్థమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

తనకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకుంటపల్లి గ్రామానికి చెందిన మౌనిక (21) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. గత నెల 21న మౌనిక వ్యవసాయ పొలం వద్ద ఉండగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆమెను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం.. అక్కడి నుంచి కర్నూలు తరలించారు. కర్నూలులో చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం మరణించారు. ఆమె తండ్రి క్రిష్టప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

బైక్‌లు ఢీ.. ఐదుగురికి గాయాలు

పుట్టపర్తి రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లకుంట రైల్వేస్టేషన్ సమీపం హంద్రీనీవా కాలువ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. మండలంలోని వెంకటగారిపల్లికి చెందిన మనోహర్, పైపల్లి చంద్ర బైక్‌పై కొత్తచెరువువైపు.. సాయినాథ్, వెంకటరాముడు, మదుసూదన్ ద్విచక్రవాహనంపై కొత్తచెరువు వైపు నుంచి మామిళ్ళకుంట కూడలివైపు బయలుదేరారు. ఈ రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆ ఐదుగురూ గాయపడ్డారు. అదే సమయంలో పుట్టపర్తి నుంచి అనంతపురం వెళుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ ప్రమాదాన్ని గమనించారు. గాయపడ్డవారిని అంబులెన్స్‌ల్లో శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. ఇందులో మదుసూదన్ పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపారు.



ప్రమాదస్థలంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి

వామ్మో.. కొనేదెలా !

- కొండెక్కిన నిత్యావసర వస్తువుల ధరలు
- భారీగా పెరిగిన కూరగాయల రేట్లు
- పోటీ పడుతున్న వంటనూనెలు
- పేద, మధ్య తరగతి వారిపై భారం



పుట్టపర్తి రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఇటీవల కాలంలో భారీగా పెరిగాయి. ఒక వైపు కూరగాయలు.. మరో వైపు వంట నూనెలు పోటీ పడి మరీ పెరుగుతున్నాయి. ఇరవైరోజుల క్రితం సామాన్యులకు అందుబాటులో ఉన్న కూరగాయలు ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఏవి కొందామన్నా.. 80 రూపాయలకుపై మాటే పలుకుతున్నాయి. ఎప్పుడూ వేసవిలో నీటి ఎద్దటి కారణంగా పంటల సాగు విస్తీర్ణం తగ్గి ధరలు పెరగడం సహజమే. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో కూరగాయలు విరివిగా పండుతున్న ఈ సమయంలో ధరలు రోజురోజుకీ పెరుగుతుండటం అందరినీ విస్మయపరుస్తోంది.

వంటనూనెల సలసల..

మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు కూరగాయలు, నిత్యావసర సరుకుల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి వారిపై వంట నూనెల ధరల భారం అధికంగా పడుతోంది. వ్యాపారులు వంటనూనెలు ధరలను అమాంతం పెంచేయడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. పదిరోజుల క్రితం కిలో సన్‌ఫ్లవర్ వంటనూనె ధర 110 రూపాయల ధర ఉండగా.. నేడు అది కాస్తా 130 రూపాయలకు చేరుకుంది. ఒక్కసారిగా రూ 20 పెరగడంతో సామాన్యుడి బడ్జెట్ గాడితప్పింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వంటనూనెలపై కేంద్ర ప్రభుత్వం సుంకం పెంచడంతో వాటి ధరల్లో పెరుగుదల పరుగులు తీసింది.

ఎలా కొనాలో..!

నిత్యావసరాలతో పాటు వంటనూనెల ధరలూ చాలా పెరిగాయి. మాలాంటి సామాన్య మధ్య తరగతి కుటుంబాలు ఎలా బతకాలి. వంట నూనె లేకుండా ఏవంట చేయలేం. ధరల నేపథ్యంలో కొనలేక అలాగని వాడకుండా ఇబ్బందులు పడాల్సివస్తోంది. దీనికి తోడు కూరగాయలు ధరలూ కొండెక్కాయి.

- అనూష, ప్రైవేట్ టీచర్, పుట్టపర్తి

కరువు మండలంగా ప్రకటించాలి

తనకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తనకల్లును కరువు మండలంగా ప్రకటించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఎందుకు కరువు మండలంగా ప్రకటించలేదో చెప్పాలని నిలదీశారు. మండల అధికారుల నిర్లక్ష్యంతోనే మండలం కరువు మండలంగా ప్రకటించలేదని ఆగ్రహించారు. ఏటా అనావృష్టి, అతివృష్టితో పంటలు నష్టపోతున్నా, కరువు మండలంలా ప్రకటనలో ఏదో మోసం జరుగుతోందన్నారు. వాతావరణ బీమా వలన నష్టపోతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలన్నారు. అన్ని బ్యాంక్‌లోనూ రైతుల రుణాలను మాఫీ చేయాలన్నారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శివన్న, రైతు సంఘం రమణ, వెంకటరమణ, సీఐటియు ఒంటెద్దువేమన్న, కాంగ్రెస్‌తోపు పారేసు, పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

విద్యార్థులతో చెత్త పనులు



పాఠశాల వద్ద చెత్త మోసుకెళ్తున్న విద్యార్థులు

తనకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో చెత్త పనులు చేయిస్తున్నారు. పాఠశాలలో శుభ్రం చేయించి.. ఆ చెత్తను వారితోనే పారేయిస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థులతో ఇలాంటి చెత్త పనులు చేయించకూడదనే ఉద్దేశంలో పాఠశాలలను శుభ్రం చేయడానికి ఆయాలను నియమించి జీతాలు ఇస్తోంది. అయినా పాఠశాల సిబ్బంది విద్యార్థులతో ఇలాంటి పనులు చేయిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. ఆ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థులు మధుమతి, చరణ్ ఆ పాఠశాలలో శుక్రవారం శుభ్రంగా చేయగా వచ్చిన చెత్తను పెద్ద బకెట్లో... పెద్ద కర్ర సాయంతో మోసుకొంటూ వెళ్లి.. ఆ పాఠశాల సమీపంలో పారబోశారు. దీన్ని గమనించిన గ్రామస్థులు ఫొటోలు తీసి.. సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దీనిపై హెచ్ఎం మహబూబీని వివరణ కోరగా.. పిల్లలతో చెత్తపనులు చేస్తున్న విషయం తమదృష్టికి వచ్చిందని, చెత్త తీసుకెళ్తున్న చరణ్, మధుమతి పాఠశాలలో పనిచేస్తున్న ఆయా ఆంజనమ్మకు బంధువులు కావడంతో ఈ పనులు చేయించిందని తెలిపారు. ఇలాంటి పనులు పిల్లలతో చేయించవద్దను ఇప్పటికే ఆమెకు పలుమార్లు సూచించామన్నారు.

ఆధార్ అవస్థలు

తనకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ పోస్టాఫీసులో ఆధార్ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విద్యార్థులు తమ ఆధార్ కార్డులో తప్పులు సరిద్దిదుకోవడానికి ఇటీవల భారీగా వస్తున్నారు. సబ్‌పోస్టాఫీసులో నిర్వహిస్తున్న ఈ ఆధార్ కేంద్రంలో కోర్తికోట బ్రాంచ్ పోస్టుమాస్టరే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో అతను అక్కడ బ్రాంచ్ పనులు పూర్తి అయిన తర్వాత... ఉదయం 11 గంటలకు తనకల్లుకు వచ్చి ఆధార్‌కేంద్రాన్ని సాయంత్రం వరకు నిర్వహిస్తున్నారు. అయితే సర్వర్ చాలా స్లోగా పని చేస్తుండటం.. పైగా ఒక కేంద్రాన్ని మాత్రమే ఏర్పాటు చేయడంతో రోజుకు మహా అంటే 50 మంది కావడం లేదు. రోజూ వందల సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆ ఆధార్ కేంద్రం వద్దకు వస్తున్నారు. దీంతో గంటల తరబడి.. వారు అక్కడ పనులు మానుకొని.. పడిగాపులు కాస్తున్నారు. ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఆధార్ కేంద్రం వద్ద రద్దీ

ఘనంగా ఓడీసీ బాబా ఆరాధనోత్సవం

ఓబుళదేవరచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక హజరత్ ఓడీసీ బాబా 9వ ఆరాధానోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు మంగళమకడ బయప్పరెడ్డి ఆధ్వర్యంలో బాబా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఫక్కీర్ల జల్సాలతో బాబాకు గంధం సమర్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.



బాబాస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ముండ్లవారిపల్లిలో తాగునీటి ఎద్దడి

నంబులపూలకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లవారిపల్లిలో నెల రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలోని రక్షిత తాగునీటిబోరు, చేతి పంపులో నీరు అడుగంటడంతో ఈ సమస్య నెలకొంది. సమీపంలో వ్యవసాయ బోర్లు కూడా లేవు. దీంతో పండగరోజున ట్యాంకర్లతో నీటిని తెప్పించుకుని పట్టుకున్నట్లు గ్రామస్థులు చెప్పారు. అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడి తీర్చాలని కోరారు.



నీటి ట్యాంకర్ వద్ద రద్దీ

అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం

ధర్మవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని రేగాటిపల్లి చెరువులో జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రేగాటిపల్లి, ముచ్చురామి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పాండురంగస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సాయంత్రం ధర్మవరం చెరువు వద్ద జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, సతీమణి చిలకం ఛాయాదేవి, బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, ఆర్డీఓ మహేశ్, టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి చింతలపల్లి మహేశ్‌చౌదరి, బీజేపీ నాయకులు హరీశ్‌బాబు పాల్గొన్నారు.



రేగాటిపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి మంత్రి మొట్టమొదటిసారిగా హాజరయ్యారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయడానికి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ అధ్యక్షన నిర్వహించిన ఈ సమావేశంలో 53 అంశాలపై చర్చించారు. పట్టణంలో పలు సమస్యలను పలువురు కౌన్సిలర్లు మంత్రి దృష్టికి తెచ్చారు. అదేవిధంగా టౌన్‌ప్లానింగ్‌లో అవినీతి గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వినతి

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని మంత్రికి సీఐటీయూ, పారిశుధ్య కార్మికులు వినతిపత్రం అందజేశారు.

డీఈఓ భేటీ

మంత్రిని సత్యసాయిజిల్లా డీఈఓ కిష్టప్ప శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని ముచ్చురామి పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేసి సర్వశిక్ష అభియాన్ డీఈ చిదంబర్‌కు పంపాలని ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు మంత్రి ఆదేశించారు.



ధర్మవరం : పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ధర్మవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కాలేజ్ సర్కిల్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి శుక్రవారం పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో ఆర్యవైశ్యసంఘం నాయకులు సుదర్శన గుప్తా, శ్రీనివాసులు, అశోక్‌కుమార్, ప్రసాద్, అంబటి బద్రీనాథ్, గ్రంధే శ్రీనివాసులు, రాజాగోవిందు, గర్రెరమేశ్‌బాబు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి..



పుట్టపర్తి : ఇందిరాగాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పుట్టపర్తి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 40 వర్ధంతిని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఇందులో పీసీసీ ఉపాధ్యక్షుడు కోటా సత్యనారాయణ, నాయకులు లక్ష్మీనారాయణ, సువర్ణ, రహంతుల్లా, అడ్వకేట్ చంద్రశేఖర్, మల్లికార్జున, షేక్ అలంనవాజ్, జిలానీ, రామచంద్ర పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: పట్టణంలోని ఇందిరాగాంధీ సర్కిల్‌లో గురువారం ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కదిరప్ప, భాస్కర్, శ్రీనివాసులు, అల్తాఫ్, గంగాధర్, ఉపేంద్ర పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు...

ధర్మవరం: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో ఆర్డీఓ మహేశ్, అధికారులు హంపయ్య, సిబ్బంది నరేశ్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.



శ్రమదానం చేసిన యువకులు, గ్రామస్థులు

ఆలయం వద్ద శ్రమదానం

ఓబుళదేవరచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనిపల్లి అక్కదేవత ఆలయానికి వెళ్లే దారికి ఇరువైపు ముళ్లపొదలు భారీగా పెరిగాయి. గౌనిపల్లి యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రమదానం చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో పెద్ద పెద్ద ముళ్ల కంపలు, ముళ్ల పొందలను తొలగించారు. కార్యక్రమంలో పూజారి పెద్దనారాయణ, సుధాకర్, లైన్‌మ్యాన్ చక్రీ, జయం జగదీష్, మల్లెల రమేష్, మహేష్, శేఖర్, మల్లిరెడ్డి, మావిటి రాజశేఖర్, వేణుగోపాల్, మునీంద్ర పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



యశిస్విత. శశిధర్‌కుమార్

ధర్మవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరానికి చెందిన క్రీడాకారులు యశిస్విత, శశిధర్ కుమార్ ఎంపికయ్యారు. అనంతపురంలో గతనెల 21న ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 విభాగంలో జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో వీరి ప్రతిభ చాటారు. వీరు శనివారం నుంచి పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగే 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఉమ్మడి అనంతజట్టు తరపున పాల్గొంటారన్నారు. వీరిని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచర్ సంజయ్ అభినందించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు..



శబరీష్‌గౌడ్

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జీవన్‌జ్యోతి పాఠశాల విద్యార్థి శబరీష్‌గౌడ్ ఎంపికయ్యాడు. అనంతపురంలోని గత నెల 23న నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలలో శబరీష్ గౌడ్ ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల మూడు నుంచి నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరపున పాల్గొంటారు. అతన్ని ఆ పాఠశాల హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

పింఛన్ల పంపిణీ

ధర్మవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్థసారధి నగర్-2 పరిధిలో ఇద్దరు లబ్ధిదారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ పింఛన్ పంపిణీ చేశారు. శుక్రవారం కలెక్టర్ వికలాంగుడు పుల్లన్న రూ.6 వేలు, వితంతువు గంతులమ్మకు రూ.4వేలు పింఛన్ మొత్తాన్ని అందజేశారు. అనంతరం కేంద్రప్రభుత్వం అందించే ఉచిత గ్యాస్ గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.

● బుక్కపట్నం: మండలంలోని కృష్ణాపురం, యాదాలంకపల్లి, మరాల, పాముదుర్తి, గునిపల్లి, సిద్దరాంపల్లి,జానకంపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రిపల్లె రఘునాథ్‌రెడ్డి శుక్రవారం పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం వారు స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలను సందర్శించారు. కూటమి ప్రభుత్వం అతిత్వరలో మెగా డీఎస్సీ నిర్వహిస్తోందని, అందులో ప్రతి ఒకరు ఉద్యోగం సాధించాలని సూచించారు.

జూదరుల అరెస్ట్

నల్లచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లుగుండు సమీపంలో కోడిపందెలు ఆడుతున్న 15 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మగ్బుల్‌బాషా శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.70,110 నగదు, 18 ద్విచక్రవాహనాలు, తొమ్మిది సెల్‌ఫోన్లు, ఐదు కోడి పుంజులను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు.

● కదిరి అర్బన్ : మండలంలోని మొటకపల్లి అటవీ ప్రాంతంలో కోడిపందెలు ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని, మరో పది మంది పరారీలో ఉన్నారని రూరల్ సీఐ మోహన్ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.70,120 నగదు, నాలుగు పందెంకోళ్లు, నాలుగు కోడికత్తులు, 15 సెల్‌ఫోన్లు, 17 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాల సీజ్

పరిగి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జయమంగళి పెన్నానది నుంచి ఇసుక తరలింపుపై ఇటీవల ఎలాంటి రాయల్టీ లేకుండా ఉచితంగా స్థానిక అవసరాల కోసం ఎద్దులబండ్లు, ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకు విరుద్ధంగా మండల పరిధిలో స్థానిక అవసరాలకు కాకుండా జయమంగళి, పెన్నానదుల నుంచి మడకశిర, హిందూపురం, పెనుకొండ, సోమందేపల్లి, కర్నాటక ప్రాంతాలకు అక్రమంగా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లు, టిప్పర్లు సీజ్‌చేసి కఠిన చర్యలు తీసుకుంటామంటూ తహసీల్దార్ హసీనాసుల్తానా తెలిపారు. రైతులు పట్టాభూములలో ఇసుక లభిస్తే తమ పొలంలో ఇసుకరీచ్ ఏర్పాటు చేసుకోవడానికి జిల్లా మైనింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చంటూ తహసీల్దార్ తెలిపారు.

ఖబరస్తాన్‌కు దారి చూపాలని వినతి


ఆర్ఐకి వినతిపత్రాన్ని అందజేస్తున్న ముస్లింలు

గోరంట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు గ్రామంలో శ్మశానవాటిక, ఈద్గాకు వెళ్లడానికి రహదారి సమస్యఏర్పడిందని దానిని పరిష్కరించాలని ముస్లింలు అధికారులను కోరారు. వానవోలు జామియా మసీదు ముత్తవలీ అబ్దుల్‌ఖార్‌జిలాని, మదార్‌సాబ్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక వాహనంలో పెనుకొండకు వెళ్లి బిసి సంక్షేమ, చేనేత జౌళిశాఖమంత్రి సవితకు వినతిపత్రం అందించారు. శ్మశానం, ఈద్గా చుట్టూ వానవోలు భూస్వాముల పొలాలుండేవని, తాము ఎలా వెళ్లి వెళ్లినా అభ్యంతరం తెలిపేవారు కాదన్నారు. ఆభూములను భూస్వాములు ఇతరులకు విక్రయించడంతో రహదారి సమస్య ఏర్పడిందన్నారు. అనంతరం గోరంట్ల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సోముశేఖర్‌రెడ్డికి, పుట్టపర్తి కెళ్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముస్లింలు వినతిపత్రాలు అందించారు.

పట్ట పగలే వెలుగులు


సోమఘట్టలో పగలే వెలుగుతున్న వీధి దీపం

చిలమత్తూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు ఎంతగా పెరుగుతున్నా....విద్యుత్ ఆదా చేసుకొని విద్యుత్ చార్జీలను తగ్గించుకోవడంలో పాలకులు, అధికారులు విఫలమవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటుచేసిన వీధి దీపాలు నిత్యం పగలు, రాత్రి తేడాలేకుండా వెలుగులు చిమ్ముతూ ప్రజలపై అదనపు భారం మోపుతున్నాయి. మండలంలోని 12 పంచాయతీలలో 4 వేల వరకు ఎల్ఈడి వీధి దీపాలను ఏర్పాటుచేశారు. అయితే వాటిని రాత్రి పూట వెలిగించి, పగటి పూట ఆర్పేయాల్సి ఉంది. కానీ వాటి నిర్వహణపై గ్రామ సర్పంచులు దృష్టి పెట్టకపోవడంతో పంచాయతీలకు వీధి దీపాల విద్యుత్ చార్జీలు బరువుగా మారాయి. సాధారణంగా ఒక్కో ఎల్ఈడి బల్బు ఒక రాత్రంతా వెలిగితే ఒక యూనిట్ విద్యుత్ ఖర్చు అవుతుంది. అదే పగలు కూడా వెలిగితే మరో యూనిట్ ఖర్చవుతోంది. ఈ కారణంగా పగటి పూట అనవసరంగా వెలిగే బల్బులకు విద్యుత్ చార్జీలను పంచాయతీలు చెల్లించాల్సి వస్తోంది.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ భవనంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన శనివారం నిర్వహిస్తామని ఎంపీడీఓ రామారావు తెలిపారు. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు హాజరవుతారని ఆయన తెలిపారు. మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ సభ్యులు కోఆప్షన్ సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచులు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

అగళిలో..

అగళి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యాదవేంద్ర తెలిపారు.

రేపు ఆర్యవైశ్య కుల గురువు రాక

హిందూపురం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) ఆర్యవైశుల కులగురువు వాసవీపీఠం బెంగళూరుకు చెందిన రెండవ గురువు సచ్చిదానంద సరస్వతీ స్వామిజీ ఆదివారం హిందూపురంలోని ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం కన్యకా పరమేశ్వరి ఆలయానికి రానున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు ఆలయం దర్శించు కుంటారన్నారు. తరువాత స్వామి వారి ఆగమనం, సామి వారిచే అమ్మవారికి మహా నీరాజనం 9 గంటలకు ప్రసాధ వితరణ ఉంటుందన్నారు.

బీజేపీ సీనియర్ నాయకులకు సన్మానం


కృష్ణమూర్తికి సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణం బీజేపీ సీనియర్ నాయకుడు పాలూరి క్రిష్ణమూర్తిని గురువారం శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆయనకు సభ్యత్వం అందించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీనాయకులుఎనుమల రామక్రిష్ణ, అంగడి రామాంజినేయులు, మేకల రవి, మధుసుధన్, హనుమంతుయాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులు సంస్కారం అలవరుచుకోవాలి

గోరంట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి విద్యతోపాటు సంస్కారం, తప్పకుండా అలవరచుకోవలని కళాశాల కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ కోరారు. ఎస్ఎపిఎస్, ఎయిడెడ్ జూనియర్, ఎఎస్‌కె డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని శుక్రవారం జరుపుకున్నారు .ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికి ఆహ్వానించారు.

నేడు గోవర్ధన పూజ

హిందూపురం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని లయన్స్ క్లబ్‌లో శనివారం సాయంత్రం గోవర్ధన పూజ జరుగనున్నట్లు అనంతపురం ఇస్కాన్ భక్తవృందదాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి భజనలు, ప్రవచనాలు ఉంటాయన్నారు.

అగళిలో అడ్రస్‌లేని ఆధార్ కేంద్రాలు


ఆధార్ అప్‌డేట్ చేయని మీసేవా కేంద్రం

- పేరుకే ఆధార్ కేంద్రం.. ప్రయోజనం శూన్యం
- కర్ణాటకకు వెళ్తున్న ప్రజలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు

అగళి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అగళి మండలం కర్నాటక సరిహద్దుకు ఆనుకుని ఉండడంతో మండలంలో ప్రజలు ఆ రాష్ట్రం మీదే ఆధారపడుతుంటారు. ఉద్యోగులు రావాలన్నా, పోవాలన్నా ఇబ్బంది పడుతుంటారు. అగళి మండలంలో కొన్నేళ్లుగా ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని అగళి మండలానికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడు విన్నవించినా పట్టించుకోలేదు. మీసేవా కేంద్రాలు సైతం లేవు. 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు ఆధార్‌కార్డులో పొరపాట్లు సరిదిద్దుకోవడానికి అవస్థలు పడుతున్నారు. మండలంలో తూతూ మంత్రంగా నరసంబుది, అగళిలో మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసినా వాటిలో అన్ని రకాల వసతులు లేక ఆధార్ కేంద్రాల నిర్వాహకులు లబ్ధిదారులను కర్నాటకలోని శిర, మధుగిరి, మీసేవ కేంద్రాలతోపాటు మడకశిర వట్టిబెట్ట మీసేవ కేంద్రాలకు పంపిస్తూ ఉంటారు. అక్కడికి పోయినా పూర్తిస్థాయిలో పనులు జరగక నిరుత్సాహంతో వెనుతిరిగి వస్తున్నారు. తల్లిదండ్రులతోపాటు విద్యార్థులు కూడా అక్కడికి వెళ్లి ఆధార్‌కార్డులో పొరపాట్లు సరిచేసుకోవాల్సి వస్తోంది. ఒక్కోసారి పనిజరగక ఎంతో డబ్బు ఖర్చుచేసి వాపసు వస్తున్నారు. ఇంత జరుగుతున్నా అగళి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల గురించి పట్టించుకోవడంలేదు. ఇకనైనా అగళి మండలంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటుచేసి అటు ప్రజలకు, ఇటు విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి



అగళి మండలంలో ఆధార్ కేంద్రాలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కర్నాటకలోని శిర, మధుగిరి, ఆంధ్రప్రాంతాలైన మడకశిర వట్టిబెట్ట గ్రామాలకు వెళ్లి ఆధార్ కార్డులో తప్పులు సరిదిద్దుకోవాల్సి వస్తోంది. అగళిలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

వన్నమ్మ, జంగమరణపల్లి

ఇతర ప్రాంతాలకు వెళ్లి వాపసు వస్తున్నాం



ఆధార్ నమోదు కోసం ఎంతో డబ్బు ఖర్చుచేసి ఇతర ప్రాంతాలకు వెళ్లి వాపసు వస్తున్నాం. ఇంత జరుగుతున్నా అగళి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల గురించి పట్టించుకున్న పాపానపోలేదు. అగళిలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నాం.

విద్యార్థి మహ్మద్‌యాసీన్

త్వరలో పల్లె రహదారులకు మరమ్మతులు

- కార్యకర్తల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం
- ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలి
- మావటూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సవిత

పెనుకొండ రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ హయాంలో గుంతలమయమైన రోడ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నిర్మిస్తున్నామని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మావటూరు గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అధికారులతో కలిసి మంత్రి సవిత పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతినెలా ఒకటవ తేదీనే రాష్ట్రంలో పింఛన్ల పండగ చేసుకుంటున్నారన్నారు.

జగన్ పుణ్యమా అని గడిచిన ఐదేళ్లలో రోడ్లన్నీ ధ్వంసమయ్యాయని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు పల్లె పండగ పేరుతో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

మాట నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు

పెనుకొండ టౌన్(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని ఆ ప్రకారం రూ.4వేలు పింఛన్‌తోపాటు పూర్తి అంగవైకల్యం కలిగిన వారికి రూ.6వేలు అందజేస్తున్నారని మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం పెనుకొండ పట్టణంలోని శ్రీరాములయ్య కాలనీలో పింఛన్ పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆప్యాయంగా పింఛన్‌దారులను పలకరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతినెలా ఒకటవతేదీనే పింఛన్ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బాబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు దాదు, షౌకత్ పాల్గొన్నారు.


మావటూరులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి సవిత

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీ బీకే


జక్కసముద్రంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ పార్థసారధి

గోరంట్ల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలసముద్రం పంచాయతీ జక్కసముద్రం, బూదిలివాండ్లపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఎంపీ బీకే పార్థసారధి శుక్రవారం పాల్గొన్నారు. దివ్యాంగుల ఇళ్లవద్దకెళ్లి పింఛన్ అందించారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నారన్నారు. పేదలకోసం యేడాది మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేసి, వారి జీవితాల్లో వెలుగులు పంచారన్నారు. ఇది మంచి ప్రభుత్వం అనే కరపత్రాలను పంచారు. ప్రతినెల 1వతేదీ ఇళ్లవద్దకెళ్లి పింఛన్ ఇస్తూ, కూటమి ప్రభుత్వ చిత్త శుద్ధికి నిదర్శనమన్నారు. ఆయనతోపాటు మండల కార్యదర్శి అశ్వర్థరెడ్డి, జిల్లా కార్యదర్శి దేవా నరసింహప్ప, నిమ్మల యువశేఖర్, నీలకంఠారెడ్డి, ఉమ్మర్‌ఖాన్, కమలాకర్‌రెడ్డి, నరేంద్ర, చిన్నా, కార్తిక్, ఈశ్వరయ్య, రంగయ్య, వెంకటరంగారెడ్డి తదితరులున్నారు.

అమరజీవి త్యాగాలు మరువలేనివి


తెలుగుతల్లికి పూలమాల వేస్తున్న బహుజన చైతన్యవేదిక సభ్యులు

పెనుకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి అసువులు బాసిన పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని ప్రిన్సిపాల్ డా. కేశవరావు పేర్కొన్నారు. స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారు జీవించినంతకాలం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటుకు ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, డా.యశోదరాణి, ప్రతాప్, రామన్న, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు. బహుజన చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చైతన్యవేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చైతన్యవేదిక బహుజన అధ్యక్షుడు బీచిగానిపల్లి రామాంజినప్ప ఆధ్వర్యంలో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలువేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రవికుమార్, నరసింహులు, పైడేటి రాందాస్, రాము అంజినప్ప పాల్గొన్నారు.

ఘనంగా వెలుగుల పండుగ


దీపాలు వెలిగిస్తున్న చిట్టి తల్లి

- ఇంటింటా ఘనంగా లక్ష్మీపూజ
- రంగురంగుల తారాజువ్వల నడుమ దీపావళి

హిందూపురం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి గెలిచిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవారాలలో దీపావళి పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఉదయాన్నే లేచి ఇంటిలిల్లపాది తలంటు స్నానాలు చేసి ఇంటిని శుద్ధి చేసుకొని కొత్త దుస్తులు ధరించి లక్ష్మీపూజను జరుపుకున్నారు. చిన్నా పెద్ద తేడాలేకుండా టపాసులు వెలిగించారు. తారాజువ్వలు పైపైకి ఎగురుతుంటే పిల్లలు కేరింతలు కొడుతూ ఆనందడోలికల్లో మునిగి తేలారు.

మడకశిర ఆలయాల్లో ఘనంగా పూజలు

మడకశిరటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దీపావళి పండుగను పురస్కరించుకొని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. గురు శుక్రవారాల్లో దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేషపూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా అభయ ఆంజనేయస్వామి, చంద్రమౌళేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి తదితర దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని షిరిడీ సాయినాథుని ఆలయంలో దీపావళిని పురస్కరించుకొని విద్యుత్ దీపాలు అలంకరించి లక్ష్మీదేవి అమ్మవారి చిత్రపటానకికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో ఇళ్ల వద్ద టపాసులు పేలుస్తూ దీపాలు వెలిగించి ఇంటిల్లిపాది ఘనంగా పండుగను జరుపుకొన్నారు.


మిట్టబండ ఆంజనేయస్వామి


షిరిడీ సాయి ఆలయంలో..

విద్యార్థినులతో దీపావళి


పిస్టల్ వినియోగాన్ని విద్యార్థులకు వివరిస్తున్న సీఐ శేఖర్

గోరంట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యారినుల తో కలిసి పోలీసులు దీపావళి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. సీఐ శేఖర్, ఎస్ఐ బాబు, పోలీస్ సిబ్బందితో గురుకుల పాఠశాలకు వెళ్లి బాలికలకు తగిన జాగ్రత్తలు చెప్పి, దీపావళి సంబరాల్లో పాలుపంచుకున్నారు. ఈసందర్భంగా ఓపన హౌస్ కార్యక్రమం ద్వారా బాలికలకు రైఫిల్ గురించి సీఐ వివరించారు. పాఠశాలలోని చాలమంది బాలికలు పండుగకు ఇళ్లకు వెళ్లారు. దాదాపు 80మంది విద్యార్థి నులు తమ కుటుంబ సభ్యులు నగరాలకు వలస వెళ్లిన కారణంగా హాస్టల్‌లోనే ఉండాల్సి వచ్చింది. ఈవిషయాన్ని సీఐ గుర్తించి, బాణసంచా సమాగ్రి తీసుకెళ్లి వారిచే కాల్పించారు. బాలికలు పండుగరోజు సంతోషాన్ని, సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రామనాయక్, వెంకటేష్, నాగభూషణ, ఉపాధ్యాయులు, విద్యార్థినీలున్నారు

నాణ్యత లేకుంటే చర్యలు


తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారి

హిందూపురం అర్బన్, నవంబరు 1: (ఆంధ్రజ్యోతి): ప్రజలకు హాని కలిగించే విధంగా నాణ్యతలేని ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ఫుడ్‌సేఫ్టీ అధికారి తస్లీం పేర్కొన్నారు. శుక్రవారం ఆమె పట్టణ పరిధిలోని పలు హోటళ్లలో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల హోటల్‌లో సరుకులు ఉంచే గది, వంట గదులలో వెలుతురు లే కపోవడంపై హెచ్చరించారు. ఇడ్లీని శాంపుల్ కోసం తీసుకెళ్ళారు. అదే విధంగా సద్భావ్ సర్కిల్‌లో ఉన్న ఎన్‌జీఓ క్యాంటిన్‌ను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని అక్కడ రైస్ ఐటెంను శాంపుల్‌కు తీసుకెళ్ళారు. శాంపుల్ కోసం తీసుకెళ్ళిన పదార్థాలను హైదరాబాదు ల్యాబుకు పంపనునట్లు ఆమె తెలిపారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా ఏ దైనా తేడాలు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు పక్కన తినుబండారాలు విక్రయిస్తున్న రాఘవేంద్ర, శ్రీనివాస టిఫిన్ సెంటర్‌లలో తనిఖీలు చేపట్టారు. ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్సు లేని వాటికి, ఎఫ్‌ఓబి లైసెన్సు లేని కారణంగా వారికి నోటీసులు అందించారు. అదే విధంగా వేడి పదార్థాలను ప్లాస్టిక్ పేపర్లలో వేసి ఇస్తే విషతుల్యమౌతాయని, ప్లాస్టిక్ సంచులు కూడా వాడకూడదని అవగాహన కల్పించారు.

ముగ్గురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

పావగడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్తవ్య నిర్వహణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్పీ కానిస్టేబుల్ శ్రీకాంత్‌నాయక్, సీఐ డ్రైవర్ నటేష్, సంతోష్‌లను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. గత సెప్టెంబరు నెలలో గుమ్మగట్ట ప్రాంతంలో పెద్ద ఎత్తున జూదకేంద్రాలు నడుపుతున్నారన్న సమాచారం మేరకు ఎస్పీ ఆధ్వర్యంలో మెరుపుదాడిచేసి 32 మందిని అరెస్టు చేసి 18 బైకులను స్వాధీనం చేసుకొన్న ఘటనలో వీరు సస్పెన్షన్ వేటుకు గురైనట్లు తెలిసింది. దాడి జరిగిన రోజు పోలీసుల నుండి జూదదారులకు సమాచారం అందిందని సస్పెన్షన్‌కు గురైన ముగ్గురు కానిస్టేబుళ్లపై పూర్వాపరాలు పరిశీలించి ఈనిర్ణయం తీసుకొన్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

పశువులకు బొబ్బరోగం


బొబ్బరోగం సోకిన దూడ

గుడిబండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుడిబండ మండలంలో పశువులకు బొబ్బరోగం సోకుతుండటంతో పాడిపశువుల రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఎస్.రాయాపురం, పి.ఎస్.పాళ్యం గ్రామాల్లోని పశువులకు బొబ్బరోగం రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు రాజ్‌కుమార్, రంగధామప్ప తదితరులు తెలిపారు. పశువులకు బొబ్బలు రావడంతో రోగం నయం కోసం ఎన్ని వ్యాక్సిన్‌లు వేయించినా వ్యాధి నయం కావడం లేదని, దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి ఉందని ప్రజలు తెలియజేశారు. ప్రభుత్వ వైద్యాధికారులు లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పశువైద్యాధికారులను నియమించి పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన

అమరాపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండలంలోని విరుపసముద్రం గ్రామంలో శుక్రవారం వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పాల్గొన్నారు. వాల్మీకి కులబాంధవులు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలను గ్రామస్తులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాయణాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు వాల్మీకి అని ఆయన కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మండల కన్వీనర్ గణేష్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, మాజీ మండల కన్వీనర్ శివరుద్రప్ప, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, ఎంపీటీసీ నగేష్, మంజునాథ్, జిల్లా వాల్మీకి కన్వీనర్ మంజునాథ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చెన్నప్ప, తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తిపై కత్తితో దాడి

హిందూపురం అర్బన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మోతుకపల్లి సమీపంలో ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కొడిగేపల్లికి చెందిన చందు, మోతుకపల్లికి చెందిన రోహిత్ ఇద్దరు స్నేహితులు. అయితే గురువారం చందు, రోహిత్‌ను డబ్బు అడగగా ఇవ్వక పోవడంతో ఇద్దరూ వాదులాడుకొన్నారు. అయితే శుక్రవారం మరోమారు చందు రోహిత్‌తో గొడవపడి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో రోహిత్ ఎడమ చేతికి గాయాలైనాయి. కాగా అప్పటికే చందు గంజాయి సేవించి ఉన్నట్లు సమాచారం. దీంతో పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

గోరంట్ల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై బూదిలి క్రాస్ రోడ్డు వద్ద స్కూటీని ఐచర్ వాహనం ఢీకొన్న సంఘటనలో మధు, హరీష్, సోముశేఖర్ శుక్రవారం తీవ్రంగా గాయపడ్డారు కర్నాటకలోని పావగడకు చెందిన వీరు ముగ్గురు ఒకే స్కూటీపై గోరంట్ల మండలంలోని దేవులచెరువు గ్రామంలోని రాజప్పఇంటిలో విందుకు హాజరయ్యారు. అనంతరం సోమందే పల్లికి వెళ్తుండగా జాతీయ రహదారి క్రాస్‌రోడ్డు వద్ద అనంతపురం నుంచి బెంగుళూరు వెళ్తున్న ఐచర్ వాహనం వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని గోరంట్ల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సోమశేఖర్ పరిస్థితి ఆందోళన కరంగా ఉంది.

పులేరు గ్రామానికి చెందిన ఆదిమూర్తి ద్విచక్రవాహనంపై పుట్టపర్తినుంచి స్వగ్రామానికి వస్తుండగా ఖాజాపురం వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. తాపీమేస్త్రీగా పనిచేస్తున్న ఆదిమూర్తి పుట్టపర్తిలో మోల్డింగ్ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. గోరంట్ల ఆసుపత్రికి తీసుకురాగా, చికిత్స అనంతరం నలుగురిని హిందూపురం ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. ఎస్ఐ బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.